




కూర గాయాలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆదివారం కూడా గతవారం మాదిరిగానే ఉన్నాయి. వారానికి సరపడా కూరగాయలతో సంచి నిండాలంటే రూ.300 నుంచి 500 వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. టమాటా, దొండకాయలు మినహాయించి ప్రతి కూరగాయ ధర గత వారం ధరే పలికింది. గత వారం రూ.80 అమ్మకం జరిగిన టమాటా ఈ వారం రూ.60లకు దిగింది. ఉల్లిపాయలు మాత్రం పాతవి రూ.60, కొత్తవి రూ.35 ధరతో కొనసాగాయి. ధరలు తగ్గుముఖం పట్టకపోవడంతో వినియోదారులు ఇబ్బందిగానే కూరగాయలు కొనుగోలు చేశారు. ఇలా అయితే కొనలేం తినలేం అంటూ అవేదన వ్యక్తం చేశారు.

ఏలూరు రైతుబజార్లలో కిలో టమాటా రూ.46, వంకాయలు రూ.44, బెండ రూ.32, మిర్చి రూ.44, కాకర రూ.32, బీర రూ.40, క్యాబేజి రూ.38, క్యారెట్ రూ.50, దొండ రూ.28, బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.35, గోరుచిక్కుడు రూ.30, చిక్కుడు రూ.96, దోస రూ.44, చామదుంప రూ.48, బీట్‌రూట్ రూ.44, కీర దోస రూ.40, బీన్స్ రూ.70, అల్లం రూ.80, క్యాప్సికం రూ.70, ఆకాకర రూ.96, ఆనప ఒక్కింటికి రూ.25, అరటి ఒక్కటికి 7 రూపాయలు, పాలకూర, చుక్కకూర, మెంతుకూర, తోటకూర కట్ట ఒక్కింటికి రూ.పది చొప్పున, పొట్లకాయ రూ.25, మహారాష్ట్ర ఉల్లి కిలో రూ.54, షోలాపూర్ కొత్త ఉల్లి రూ.50 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు.

పాలకొల్లులో వంకాయలు కిలో రూ.80, బీరకాయలు కిలో రూ85, దోస కాయలు రూ.60, దొండ, బెండ కిలో రూ.45, బంగాళాదుంపలు రూ.60, ఉల్లిపాయలు రూ.45 నుంచి 50, పచ్చిమిర్చి రూ.60, టమాటా రూ.65 నుంచి 70 ధర పలికాయి.

శయన మహావిష్ణువుగా శ్రీవారు



పుష్పాలను పాన్పుగా చేసుకుని పవళించిన శ్రీమహావిష్ణువుకు శ్రీదేవి, భూదేవిలు సేవలు చేస్తున్నట్లున్న శయన మహావిష్ణువు అలంకరణలో చినవెంకన్న ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతీరోజూ జరుగుతున్న అలంకార మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ ముఖమండపంలో జరిగిన ఈ అలంకరణలో శయనమహావిష్ణువుగా ఉన్న స్వామిని పలువురు భక్తులు దర్శించి తరించారు.

బ్రహ్మోత్సవాలకు జయమంగళం

ద్వారకాద్రి నివాసాయ దివ్యసూర్యర్పితాయచ..
అలర్మేల్మంగ నాథాయ వేంకటేశాయ మంగళం.

ద్వారకాతిరుమల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని క్షేత్రంలో ఈ నెల 12 నుంచి ప్రారంభమైన స్వామివారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిలిపి వేసిన నిత్యార్జిత సేవలు, నిత్యకల్యాణాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

శాస్త్రోక్తంగా చూర్ణోత్సవ, వసంతోత్సవాలు

చిన్నతిరుమలేశుని బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయంలో ఆదివారం విశేష కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయ ప్రాంగణంలో తిరుచ్చి వాహనంపై కొలువు తీరిన స్వామి అమ్మవార్ల ఎదుట చూర్ణోత్సవ, వసంతోత్సవాలను అర్చకులు ఘనంగా జరిపారు. అలాగే రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీవారికి ద్వాదశకోవెల ప్రదక్షిణలు. శ్రీపుష్పయాగోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అర్చకులు, మహిళలు శ్రీవారిని కీర్తిస్తూ వడ్లను దంచారు. ఆతరువాత ఇందులో పాల్గొన్న భక్తులపై వేడుకగా వసంతాలను చల్లారు. ఆలయ ప్రాంగణంలో ఉభయదేవేరులతో శ్రీనివాసమూర్తికి 12 ప్రదక్షిణలు, 12 సేవాకాలాలు, 12 రకాల పిండి వంటలతో నివేదన రాత్రి కన్నుల పండువగా జరిగింది.



చూర్ణోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారిని కీర్తిస్తూ వడ్లు దంచుతున్న అర్చకులు

వాయుగండం

- బలపడనున్న అల్పపీడనం
- విస్తారంగా వర్షాలు
- రైతుల్లో ఆందోళన

ఏలూరుసిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరో వాయుగుండం ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చెబుతున్నాయి. తూర్పు బంగాళాఖాతంలో ఈనెల 21, 22 తేదీల్లో అల్పపీడనం ఏర్పడి అది పశ్చిమ వాయువ్యంగా పయనించి ఈనెల 23 వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడే అవకాశాలున్నాయని హెచ్చరికలు జారీ చేసింది. ఈ కారణంగా ఉత్తర కోస్తాలో భారీగా వర్షాలు కురుస్తాయని ఈనెల 24 నుంచి భారీగా వర్షాలు కురుస్తాయని చెబుతోంది. జిల్లాలో ఈ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో అప్పుడే ఆందోళన మొదలైంది. ఇప్పటికే బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరి తల అవర్తనం కారణంగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలో కొన్ని చోట్ల భారీగాను , మరి కొన్ని చోట్ల స్వల్పంగాను వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉరుములు, పిడుగులుతో కూడిన భారీ వర్షాలు కురుస్తుండటంతో పంటలు దెబ్బతింటాయిని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. వరికోతలు కూడా మొదలు కావటంతో వర్షాలు భారీగా కురిస్తే పంట చేతికి అందే అవకాశాలు తక్కువగా ఉంటాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులు ప్రభావం ఎక్కువగా ఉండడంతో వరి పంట నేలకొరిగితే పంట పూర్తిగా తడిసిపోతుందని, వరి పంట కుళ్లిపోయే అవకాశాలుంటాయిని రైతులు చెబుతున్నారు. అయితే ఏలూరు జిల్లాలో ఇప్పుడు కొన్ని మండల్లాలోనే వరి కోతలు ప్రారంభం అయ్యాయి. ఈనెల 22వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవనున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురిస్తే వరి కోతల విషయంలో జాప్యం జరుగుతుందని చెబుతున్నారు.



పంట కాపాడుకునేందుకు పాట్లు

వాతావరణ శాఖ హెచ్చరికలతో పంటను రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో మబ్బుపడితే భారీగానే వర్షం కురుస్తోంది. ప్రస్తుతం ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యాన్ని బరకాలు కప్పి రక్షించుకుంటున్నారు. పగటి సమయంలో ధాన్యాన్ని ఆరబెట్టినా, వర్షం వస్తుందనే సమయంలో మాత్రం బరకాలు కప్పి జాగ్రత్త చేసుకుంటున్నారు. కొంత మంది రైతులైతే కుప్పలు వేసి, వాటిపై బరకాలు కప్పుతున్నారు. పంట చేలల్లో కుప్పలు తడిసి పోకుండా కూడా పలు చోట్ల జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి సిద్ధం చేసుకుంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అల్పపీడనం, వాయుగుండం హెచ్చరికలతో రైతులు సతమతమవుతున్నారు.



నూజివీడులో 20.6 మి.మీ వర్షపాతం

జిల్లాలో గడచిన 24 గంటల్లో నూజివీడు మండలంలో అత్యధికంగా 20.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లాలో వర్షం కురిసిన మండలాల్లో వర్షపాతం వివరాలు.. కలిదిండిలో 20.4, ముసునూరు 17.8, మండవల్లి 13.6, పోలవరంలో 13.2, ముదినేపల్లి 12.6, కైకలూరు 10.2, ఆగిరిపల్లి 9.6, కామవరపుకోట 7.2, చాత్రాయిలో 7.2, భీమడోలు 6.4, నిడమర్రు 5.4, కొయ్యలగూడెం 5.2, వేలేరుపాడు 5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మిగిలిన చోట్ల 5 మి.మీ కన్నా తక్కువ నమోదైంది.

జల్లేరు జలాశయం గేట్లు ఎత్తివేత

బుట్టాయగూడెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం గేట్లను ఆదివారం సాయంత్రం ఎత్తి 200 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. జలాశయం అటవీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో కొండవాగుల ద్వారా జలాశయంలోకి 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 217.25 ఎంటీఎస్‌కు చేరడంతో ముందుజాగ్రత్త చర్యగా 200 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నామన్నారు.

దాళ్వాకు విత్తన కొరత?

ఏపీ సీడ్స్, ప్రైవేట్ సీడ్ ఆధారం

భీమవరం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది సార్వా సాగులో చేసే దాళ్వా విత్తన సాగుకు అధిక వర్షాలు దిగుబడిపై ప్రభావం చూపింది. దీంతో వచ్చే దాళ్వా పంటకు రైతుకు విత్తనం కొరత ఏర్పడే అవకాశం ఉంది. జిల్లాలో విత్తన సాగు 5వేల ఎకరాలలో మాత్రమే సాగింది. పంట చూస్తే ఎకరానికి 1121 రకం విత్తన సాగు 20 బస్తాలు లోపు వచ్చేలా కనిపిస్తున్నాయి. 1153 రకం విత్తన సాగు నరసాపురం, పాలకొల్లు ప్రాంతాలలో ఎక్కువ మక్కువ చూపుతారు. అందువలన 1121 రకం విత్తనం ఎక్కువ అవసరం అవుతుంది. ప్రస్తుత విత్తన సాగు పంటను బట్టి 40వేల క్వింటాళ్ళు వరకు దిగుబడి వస్తుందని అంచనా వేయవచ్చు. అయితే రాబోయే దాళ్వాసాగుకు 55వేల క్వింటాళ్ళు వరకు విత్తనం అవసరం ఉంటుంది. ఆ లెక్కన 15వేల క్వింటాళ్ళు విత్తనం ఏపీ సీడ్, ప్రైవేట్ సీడ్‌లను రైతులు ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ఏడాది విత్తన సాగు తగ్గింది. గతంలో 8వేలు ఎకరాలకు పైగా విత్తనసాగు సాగేది. రైతు విత్తనం రైతులకే సరిపోయేది. ఈ ఏడాది సాగు తగ్గటం వలన సీడు కొరత వస్తుందని రైతులు అంటున్నారు. దిగుబడి 30 బస్తాలు ఉంటే సరిపోను అలా వచ్చేలా కనిపించనందున సీడు కొరత తప్పదనిపిస్తున్నది.

ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు



జిల్లాలో సార్వా వరి సాగుకు సంబంధించి మాసూళ్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 22న ఉంగుటూరులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాల ద్వారా సార్వా ధాన్యం సేకరణ చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. కొనుగోలు లక్ష్యాలను కూడా నిర్దేశించుకున్నది.

- రేపటి నుంచి ప్రారంభం
- 250 రైతు సేవాకేంద్రాలు
- ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 3.40 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు సిబ్బందికి శిక్షణ
- ఊపందుకున్న వరి కోతలు

ఏలూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సార్వాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని ప్రాథమిక అంచనా వేశారు. దీనికి అనుగుణంగా జిల్లాలో రైతుల నుంచి 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమైన ప్రాంతాల్లో సార్వా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం అవుతాయని జిల్లా పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

వరి కోతలు

జిల్లాలో సార్వా సీజన్‌కు లక్షా 96వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో ముందస్తు వరి సాగు చేసిన ప్రాంతాల్లో వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. మాసూళ్లు పూర్తయిన ప్రాంతాల్లో కొనుగోలు ప్రారంభిస్తారు. జిల్లాలోని ఉంగుటూరు, భీమడోలు తదితర ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభం కాగా దెందులూరు, పెదపాడు, నిడమర్రు మండలాల్లో కూడా కొద్ది రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి.

రైతు సేవాకేంద్రాలకు అనుబంధంగా ఈ సార్వా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించడానికి 127 సొసైటీలను గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను అనుసరించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం కామన్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2300, ఎ-గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని రైతుల కళ్ళాల నుంచి కొనుగోలు చేసి వారు ఎంపిక చేసుకున్న సమీప రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తారు.

కొనుగోలు సిబ్బందికి శిక్షణ పూర్తి

ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించడానికి సాంకేతిక సిబ్బందికి, ధాన్యం కొనుగోలు చేసే సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో తేమ శాతం లెక్కించడం, ధాన్యం తూకం, వాహనాల ద్వారా రైస్ మిల్లుకు పంపడం, తదితర అంశాలపై సంబంధిత వ్యవసాయ శాఖాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, కస్టోడియన్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, తదితర సిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమాల్లో టీసీఎస్ సంస్థ ద్వారా సాంకేతిక పరమైన శిక్షణ ఇవ్వడం జరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలుకు సంబంధించి అన్ని పరికరాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా తేమ కొలిచే యంత్రాన్ని, తూకం యంత్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులు సిద్ధం చేశారు. రవాణాకు సంబంధించి వాహనాలను ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం 3.40లక్షల మెట్రిక్ టన్నులు

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో లక్షా 80వేల ఎకరాల్లో వరి సాగు చేయగా 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని భావిస్తున్నారు. ఈ సీజన్‌లో సుమారు 3.40 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో సహకార సంఘాలు, డీసీఎంఎస్‌లు, రైతుల ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పీవో)ల ద్వారా 250 రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. దాదాపు 12 లక్షల గోనె సంచులను సిద్ధంగా ఉంచామన్నారు. లారీ యూనియన్లు, రైస్ మిల్లర్లు, ఇతర ప్రైవేటు వాహన యజమానుల ద్వారా జీపీఎస్ పరికరం అమర్చిన వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు సొంత వాహనం ద్వారా ధాన్యాన్ని రవాణా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు జేసీ తెలిపారు. రైతు కళ్లాల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించామని, అవసరమమయ్యే ఖర్చులు ప్రభుత్వం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ భరిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. కొనుగోలు సమస్యలపై కంట్రోలు రూమ్‌లో 08812 230448, టోల్ ఫ్రీ నెంబర్ 18004256453 నెంబర్లలో సంప్రదించవచ్చునన్నారు. జిల్లాలో ఈ నెల 22 నుంచి ఏపి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. అనగా క్వింటాలుకు కామన్ రకం ధాన్యం రూ. 2300, గ్రేడ్-ఎ రకం ధాన్యం రూ. 2320 ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు జేసీ వివరించారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం హమాలీల ఖర్చులు, గోనె సంచుల వినియోగ రుసుంను ప్రభుత్వం భరిస్తుందన్నారు. ధాన్యం ఖరీదుతో పాటు ఆయా ధరలను సంబంధిత రైతుల ఖాతాలకు చెల్లించబడుతుందన్నారు. ఈ విషయంలో ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి ప్రభుత్వం వారు అందించే సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి తెలియజేశారు.

రూప్‌చంద్ అధరహో!

- కేజీ రూ.122
- రైతుల ఆనందం
- కేజీకి సుమారు రూ.20 లాభం



నిడమర్రు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతు ఆనందపడుతున్నాడు. నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించింది. జూలై నెల నుంచి అత్యధిక ధరలు పలుకుతున్నాయి. దసరా పండుగ రోజుల్లో అసాధారణంగా రూప్‌చంద్ చేపకు అత్యధికంగా రూ.122 ధర పలికింది. సాధారణంగా రూప్‌చంద్ మార్కెట్ జనవరి నుంచి మే నెల వరకు అత్యధిక ధర పలుకుతు ఉంటుంది. జూన్, జూలైలో సముద్రం చేపలు అధికంగా లభించడం, పండుగల వల్ల రేటు తక్కువగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మార్కెట్లు చలనం కలిగి రేట్లు పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రైతుకు గిట్టుబాటు

సాధారణంగా కేజీ రూప్‌చంద్ తయారీకి రైతుకు అన్నీ కలిపి రూ. 95- 100 వరకు ఖర్చు అవుతుంది. నేడు మార్కెట్ రేటు పెరగడంతో రైతుకు కేజీ చేప ధర రూ.122 పలుకుతోంది. దీంతో ఒక కేజీకి సుమారు రూ.15 నుంచి రూ.20 గిట్టుబాటు అవుతోంది. రైతులు తమ చేపల అమ్మకానికి సిద్ధపడుతున్నారు.

తగ్గిన రూప్‌చంద్ సాగు

ఇటీవల వరకు నష్టాల భారంతో ఆక్వా రైతులు చతికిలపడ్డారు. రూప్‌చంద్ చెరువుల సాగు కూడా పూర్తిగా తగ్గిపోయింది. చాలా మంది రైతులు చెరువులను అయినకాడికి లీజుకిచ్చి చేతులు దులుపుకొన్నారు. నేడు ప్రభుత్వ విధానాలు మారడం, చేపల ధరలు కూడా పెరగడంతో మళ్లీ పాత రోజులు వచ్చాయని ఆశపడుతున్నారు. నేడు మేత ధరలు కొంత మేర తగ్గడంతో పాటు మార్కెట్‌ను శాసించే దళారులు లేకపోవడం కూడా చేపల ధరలు పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు.

గత ప్రభుత్వం విధానపర లోపాలు



గత ప్రభుత్వ హయాంలో విధానపర లోపాల వల్ల ఆక్వా రంగం దెబ్బ తింది. చేపల సాగు చేసిన రైతులు కూడా నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. నూతన ప్రభుత్వంలో మార్కెట్‌లలో నిలకడ వచ్చి చేపల రేట్లు ఎన్నడూ లేనంతవిధంగా పెరగడంతో రైతు లాభాల బాట పట్టాడు. ఇది రైతులకు శుభసూచకం.

పొత్తూరి నరసింహరాజు, ఆక్వా రైతు, పత్తేపురం

న్యాయమూర్తుల సదస్సులో హైకోర్టు జడ్జి



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తులు, న్యాయాధికారులతో హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి

ఏలూరు క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తులు, న్యాయాధికారుల సదస్సు ఏలూరు జిల్లా కోర్టు హాలులో ఆదివారం నిర్వహించారు. సదస్సుకు హైకోర్టు జడ్జి కె.సురేష్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లాలో కేసుల పరిస్థితి, పలు అంశాలపై విచారణ, కోర్టుల పనితీరుపై విశ్లేషణ నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణ, న్యాయ సేవాధికార సంస్థ, అదనపు కోర్టులు, బార్ అసోసియేషన్ భవనాలను పరిశీలించారు. ఆయనతో జిల్లా న్యాయాధికా రులతో గ్రూప్ ఫోటో దిగారు.

జడ్జిని కలిసిన అధికారులు

హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సురేష్‌రెడ్డిని జిల్లాలో పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి జడ్జిని కలిసి పూలమొక్కను అందించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, తదితర అధికారులు ఆయనను కలిసి పూలమొక్కను అందించారు.

స్పోర్ట్స్ కార్నర్




బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచిన భీమవరం విష్ణు ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాల, నరసరావుపేట విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న దృశ్యం

ముగిసిన ఇంటర్ కాలేజీయట్ బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్ అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జెఎన్టీయుకె సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీయట్ బ్యాడ్మింటన్ మెన్ అండ్ ఉమెన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీల్లో పురుష విభాగంలో మొదటిస్థానం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు దక్కగా, మహిళా విభాగంలో మొదటిస్థానం భీమవరం విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల టీమ్‌కు దక్కింది. కళాశాలలో విజేతలకు కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. పురుషుల విభాగంలో రెండోస్థానంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మూడోస్థానంలో కృష్ణా జిల్లా పరిటాలలో ఉన్న అమృతసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కృష్ణా జిల్లా నంబూరులో ఉన్న వీవీఐటీ కళాశా దక్కించుకున్నాయని క్రీడల కమిటీ కన్వీనర్, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణరాజు తెలిపారు. మహిళల విభాగంలో ద్వితీయ స్థానంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మూడోస్థానంలో గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు దక్కిందన్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో 29 కళాశాలలు నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. జేఎన్టీయుకే పరిశీలకురాలుగా డాక్టర్ సునీత, డాక్టర్ శరత్‌తో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ హరి మోహన్, సారిక, అవినాష్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జూనియర్ జట్లు ఎంపిక

టి.నరసాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జూనియర్ జట్ల ఎంపిక మండలంలోని బొర్రంపాలెం హైస్కూల్లో ఆదివారం జరిగింది. చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈనెల 25 నుంచి 27వరకు నిర్వహించే 43వ రాష్ట్రస్థాయి అండర్ 18 ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. పోటీలను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు రమేష్ ప్రారంభించారు. జిల్లాస్థాయి జట్టుకు బాలికలు 40 మంది, బాలురు 50 మంది హాజరు కాగా 15మంది బాలికలు, 15మంది బాలురు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు గొడుగు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాంబశివరావు,రంగారావు, హెచ్ఎం అలీ ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించారు.

రైఫిల్ షూటింగ్ జాతీయ జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఓపెన్‌సైట్ కేటగిరి విభాగంలో పాల్గొనే జాతీయ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కెవీ స్వామి తెలిపారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపికైన రాష్ట్ర జట్టును ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి ప్రకటించారు. ఓపెన్ సైట్ కేటగిరిలో అండర్-14 బాలికల విభాగంలో వి.జాగృతిరెడ్డి(వైఎస్ఆర్ కడప), ఎస్.జోహసిద్రా(తూర్పుగోదావరి), డి.సౌమ్యశ్రీ (పశ్చిమగోదావరి), అండర్ -14 బాలుర విభాగంలో ఎ.లిఖిత్‌రామ్ (పశ్చిమగోదావరి), డి.వేద్‌వీక్షిత్ (తూర్పుగోదావరి), వి.తీక్షణసాయి (అనంతపురం) ఎంపికయ్యారని స్వామి తెలిపారు. అలాగే అండర్-17 బాలికల విభాగంలో ఎం.సాయి ఐశ్వర్య (కర్నూలు), సి.గురుప్రవల్లిక (అనంతపురం), వి.ఫైజాసుల్తానా(వైఎస్ఆర్ కడప), అండర్-17 బాలుర విభాగంలో ఎస్ఎండీ ఉబయిద్ (వైఎస్ఆర్ కడప), పి.సాయి సుమేష్ (తూర్పుగోదావరి), ఎల్.రామ్‌జిగ్నేష్ (కర్నూల్) ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్-19 బాలికల విభాగంలో ఎస్‌డీ మహేజమీన్ (వైఎస్ఆర్ కడప), ఎం.పల్లవి (కర్నూల్), ఎం.మల్లికాబాయ్ (అనంతపురం), అండర్-19 బాలురు విభాగంలో ఏపీ సూర్య రామసంజీవరెడ్డి (వైఎస్ఆర్ కడప), టి.వెంకటఅఖిల్ (అనంతపురం), డి.సాయితేజ (తూర్పుగోదావరి) ఎంపికయ్యారన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌లు అనంతపురం, కర్నూల్, వైఎస్ఆర్ కడప జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయని స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో ఎంపికైన జట్టు డిసెంబరు 24 నుంచి వచ్చేఏడాది జనవరి ఒకటో తేదీ వరకూ భోపాల్‌లో జరిగే జాతీయపోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి నారాయణ, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి, పీఈటీలు పాల్గొన్నారు.



మొదటిస్థానంలో నిలిచిన అనంతపురం జట్టు



కళాకారులను సత్కరిస్తున్న హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఘనంగా కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హేలాపురి కళాకారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు వైఎమ్‌హెచ్.ఏ ప్రాంగణంలో కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం ఘనంగా జరిగింది. అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులను ఆదుకోవాలని అంతరించి పోతున్న కళలను బతికించుకోవాలన్నారు. అనంతరం పౌరాణిక కళాకారులు బి.రామాంజనేయ సిద్ధాంతికి గౌరవ సత్కారం నిర్వహించారు. పౌరాణిక నటులు పిల్లి శౌరి, బి.రామారావు, బి.వాణి, డప్పుకళాకారులు ఈ.లక్ష్మణ రావులకు గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో ఆర్థిక సత్కారం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీవి రోషన్, పట్టాభివర్మ, మోదుగు కృష్ణారావు, లంకా వెంకటేశ్వర్లు, పైడి భీమేశ్వరరావు, గండికోట రాజేష్, సంకు సురేష్, కె.వెంకట సుబ్బారావు, ఎమ్డీ ఖాజావలీ, కె.వి సుబ్బారావు పాల్గొన్నారు. తొలుత గండికోట రాజేష్ శిష్యబృందం స్వాగత నృత్యాలు అలరించాయి. సత్రంపాడు శ్రీరామాంజనేయ నాట్యమండలి వారిచే రాయభారం సెంట్రల్ సీన్ ఆకట్టుకుంది.

లేత వయసు ప్రేమలు

దారి తప్పుతున్న మైనర్లు

వారిద్దరూ మైనర్లు...ఓ కళాశాలలో పరిచయం అవుతారు.. పరిచయం కాస్తా ప్రేమగా మారుతుంది. ఒకానొక సమయంలో ఇద్దరూ ఏకం అవుతారు.. అనంతరం పెద్దలకు ఇష్టం ఉన్నా లేకపోయినా బయటకు వెళ్లి వివాహం చేసుకుంటారు. పిల్లలు పుట్టాక ఇక అక్కడ నుంచి విబేధాలు ప్రారంభం అవుతాయి. అవి విడిపోయే వరకు దారి తీస్తాయి.. ఇదంతా 2000 సంవత్సరంలో విడుదులైన ఒక సినిమాలోని సన్నివేశం.. ఆ సినిమాలో చూపించిన విధంగానే ప్రస్తుత సమాజంలో యువత కూడా పయనిస్తున్నది. మైనార్టీ తీరకుండానే ప్రేమ పేరుతో ఆకర్షితులై తర్వాత ఇబ్బందులు పడుతున్నారు. - భీమవరం క్రైం



ఎవరైనా అమ్మాయి చనువుగా మాట్లాడితే చాలు దాన్ని ప్రేమగా అర్థం చేసుకుని ఇక చదువుపై దృష్టి తగ్గిస్తున్నారు. ఒకవేళ అవతలి వారు ప్రేమకు అంగీకరించకపోతే ఏదో ఒక అఘాయిత్యానికి పాల్పడుతూ జీవితాలను ప్రేమకు పణంగా పెడుతున్నారు. పెద్దలు ఏమైనా అంటే ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్ళిపోయి పెళ్లి చేసుకుని కొన్నాళ్ళకు తిరిగి రావడం పరిపాటిగా మారింది. వచ్చినవారు మైనర్లు అయితే పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే కొంత మంది మాత్రమే దూరం అవ్వడానికి ఒప్పుకుంటుండగా మరి కొంత మంది తాము విడిపోయేది లేదంటూ ఖరాఖండిగా చెబుతూ ఉండటంతో పోలీసులు కూడా చేతులేత్తేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరోపక్క ప్రేమ వివాహం చేసుకున్న వారు పిల్లలు పుట్టిన తర్వాత విబేదాలు రావడంతో ఎంతోమంది విడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో వారు పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కక తప్పడం లేదు. ఇలా



చిన్నతనంలోనే ప్రేమ పెళ్లిళ్లు.. కొన్నాళ్లకే ఎడబాటు

పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు

ఎంతోమంది యువత వారి భవిష్యత్ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

- భీమవరం నాచువారి సెంటర్‌కు చెందిన ఒక యువకుడు కొన్నాళ్ల క్రితం అదే ప్రాంతంలో ఉన్న యువతి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే తల్లితండ్రులు ఎంతో నచ్చజెప్పినప్పటికీ ఆ యువకుడే తనకు కావాలంటూ పట్టుబట్టింది. ఈ విషయమై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరిగింది. వివాహం చేసుకున్న యువకుడిని పోలీసులు ఆ యువతిని ఎలా పోషిస్తావు అంటూ నిలదీయగా సరైన సమాధానం లేదు. అయినా కూడా ఆ యువతిని తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అయితే తర్వాత వారిద్దరి మధ్య విబేదాలు నెలకొని విడిపోయారు.
- పాలకొల్లు మండలానికి చెందిన ఒక యువతి భీమవరం కళాశాలలో చదువుతూంది. భీమవరం పట్టణానికి చెందిన యువకుడు ఆమెను ప్రేమ పేరుతో లొంగదీసుకుని వివాహం చేసుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినా కూడా ఆ యువతి వినకపోవడంతో ఆమె తల్లిదండ్రులు తన కూతురు చనిపోయిందంటూ వెళ్లిపోయారు. కానీ కొంతకాలానికి ఇద్దరూ విడిపోగా ఆ యువతి తల్లిదండ్రుల చెంతకు చేరింది.
- భీమవరం పట్టణానికి చెందిన యువతిని విశాఖపట్టణానికి చెందిన యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఒక కుమారుడు జన్మించాక ఆ యువతిని పుట్టింటికి పంపించి ఆ యువకుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాడు. తర్వాత నుంచి అతని జాడ లేకుండా పోయింది.
- నరసాపురం పట్టణానికి చెందిన యువతి మొగల్తూరు మండలానికి చెందిన యువకుడిని ప్రేమ వివాహం చేసుకొంది. ఇద్దరూ కలిసి ఒకే కంపెనీలో పనికి చేరారు. కానీ కంపెనీలో పనిచేస్తూ ఉండగానే ఇద్దరికి విబేధాలు రావడంతో అక్కడ తగాదా పడ్డారు. చివరకు విడిపోయారు.

తెలిసీ తెలియక జీవితాలు నాశనం..



ప్రస్తుత సమాజంలో యువత ఎవరిమాట లెక్క చెయ్యడం లేదు. అలా వారి భవిష్యత్ అడ్డదారులకు తావు అవుతుంది. దానివల్ల భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో కష్టాలను భరించిన తల్లిదండ్రుల పరిస్థితి అయోమయంలో పడుతోంది. పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్న ఆశలు నెరవేరడం లేదు. ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుని కొన్నాళ్ల తర్వాత తెగతెంపులు చేసుకుంటున్నారు. యువత చెడుదారుల వైపు వెళ్ళకుండా స్కూళ్లలో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

కాళీచరణ్ ,భీమవరం టూటౌన్ సీఐ

సెల్యూట్ పోలీస్



నేడు అమర వీరుల సంస్మరణ దినోత్సవం

ఏలూరు క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రేయనక, పగలనక 24 గంటలూ ఉద్యోగం చేసేది పోలీసులే. తుఫాన్లు వచ్చినా, వరదలు వచ్చినా తమ కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారో, ఎలా కాపాడుకోవాలో అన్న విషయం కంటే ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని విధి నిర్వహణలోనే ఉండాల్సిన పరిస్థితులు వారివి. పండుగొస్తే అంతా తమ భార్యాబిడ్డలతో కలిసి ఆనందంగా ఉంటే పోలీసులు మాత్రం తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఏ గుడిదగ్గరో, ఏ ప్రధాన కూడళ్ళలోనో, ఏ వీఐపీ వద్దో విధి నిర్వహణలో ఉంటూ మనసులో పండుగ జరుపుకోవాల్సిందే.. ప్రజలకు పోలీసులు ఎంత దగ్గర అవుతున్నప్పటికీ ప్రజలు మాత్రం వారికి ఇంకా దూరంగా ఉండడంపై పోలీసులు కొంత ఇబ్బందికి గురవుతున్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు చేరువ కావడానికి 15 ఏళ్ళుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైత్రీ సంఘాలు, జన సంరక్షణ సంఘాలు, పోలీసు గ్రామ రక్షణ కమిటీలు, శాంతి కమిటీలు పేర్లతో ప్రజలకు చేరువవుతూ వచ్చారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో పోలీసుకు దత్తత కూడా చేశారు. సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణా లను పణంగా పెడుతున్న పోలీసులకు ప్రజలు కూడా చేరువ కావాలి. శాంతిభద్రతల పరిరక్షణలో వారికి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. నేడు పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఎక్కడ ఏ ట్రాఫిక్‌కు అంతరాయం జరిగినా ఎక్కడ ఏ సంఘటన జరిగినా పోలీసులు ఎక్కడ అంటూ ఆతృతగా ప్రతి ఒక్కరు ఎదురు చూస్తారు. వెయ్యి మంది ఆందోళనకారులు వచ్చినా అదుపు చేయగల శక్తి ఆ పోలీసు యూనిఫాంకు ఉంది. శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులు అహర్నిశలు విధి నిర్వహణలో విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు. 2022 ఏప్రిల్ 3వ తేదీన జిల్లా విభజన జరగడంతో ఏలూరు జిల్లాగా ఆవిర్భవించింది. పోలీస్ సిబ్బంది పంపకాలు అనంతరం జిల్లాకు 1,463 మందిని కేటాయించారు. వీరికి చేదోడు వాదోడుగా 605 మంది హోమ్‌గార్డులు జిల్లాలో వివిధ విభాగాల్లో విధులను నిర్వర్తిస్తున్నారు. ఎనిమిది ఏళ్ళుగా పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో రిటైర్‌మెంట్ అవుతున్నారే తప్ప పోస్టులు భర్తీ అవ్వడం లేదు. గతంలో స్టేషన్లకు ఉన్న సిబ్బందే ఉంటున్నారే తప్ప అదనపు సిబ్బంది మంజూరు కావడం లేదు. ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతూ రకరకాల నేరస్తులు ప్రజలను మోసాలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని ఛేదించడంలో పోలీసులు ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో కూడా ఉంటూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగంపై పనిభారం పెరిగిపోయింది. పోలీసులకు నిర్వహించే వైద్య శిబిరాల్లో షుగరు, బీపీలు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ఏడాది అనారోగ్యంతో ఒక ఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్, ఒక ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఏఆర్ కానిస్టేబుల్ మొత్తం ఐదుగురు మరణించారు. ఒక హోంగార్డు అనారోగ్యంతో మరణించాడు.

నేడు అమర పోలీసులకు నివాళులు

1959లో చైనా, ఇండియా యుద్ధం జరుగుతున్న సమయంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు అక్టోబరు 21వ తేదీన సరిహద్దు ప్రాంతమైన లడక్ వద్ద టెంట్‌లు వేసుకుని గస్తీలో ఉన్నారు. ఆ సమయంలో చైనా మిలటరీ దళాలు మూకుమ్మడిగా సీఆర్‌పీఎఫ్ స్థావరంపై దాడిచేసి 10 మంది జవాన్లను ఊచకోత కోశారు. వారు ఆఖరి నిమిషం వరకు వీరోచితంగా చైనా మిలటరీతో పోరాడి అశువులు బాశారు. ఆ నాటి నుంచి పోలీసు శాఖ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తోంది. ఏలూరులోని జిల్లా పోలీసు పరేడ్స్ గ్రౌండ్స్‌లో సోమవారం ఉదయం 65వ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర ఏ విధంగా ఉందో సమాజ రక్షణలో పోలీసు పాత్ర అదే విధంగా ఉంది. సమాజ శ్రేయస్సు ధ్యేయంగా విధి నిర్వహణలో అసాంఘిక శక్తులతో పోరాడి అశువులు బాసిన పోలీసులను స్మరించుకుని నివాళులర్పించడానికి పోలీసు యంత్రాంగం సమాయత్తమైంది.

పోలీస్ సంక్షేమానికి కృషి చేస్తాం : ఎస్పీ కెపీఎస్ కిషోర్



శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజా శ్రేయస్సుకు పోలీసులు శక్తి వంచన లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీస్ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం. వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ప్రతినెల గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా నిలుస్తుంది. వారికి రావాల్సిన అన్ని రాయితీలను సకాలంలో త్వరితగతిన అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఆ కుటుంబానికి తోడ్పాటుగా ఉండేందుకు కారుణ్య నియామకాలు త్వరితగతిన జరుపుతున్నాం. పోలీసుల ఆరోగ్య భద్రతకు ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇస్తూ మెడికల్ క్యాంపులు నిర్వర్తిస్తున్నాం.



చెక్కు చెదరని కట్టడం

ఏలూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కట్టిన ఐదారేళ్లకే కూలిపోతున్న లేదా దెబ్బతింటున్న ప్రభుత్వ భవనాలు కొన్ని మనకు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే వందేళ్ల దాటినా చెక్కుచెదరకుండా నాణ్యమైన నిర్మాణానికి నిదర్శనంగా నిలుస్తోంది ఏలూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలోని తహసీల్దార్ కార్యాలయం. దీన్ని స్వాతంత్ర్యానికి పూర్వం 1910లో నిర్మిం చారు. గోడలను రాళ్ళతో నిర్మించారు. కలెక్టరేట్‌ను మొత్తం పెద్దపెద్ద రాళ్ళతో నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని గోడలతో నిర్మించి పైకప్పు పెంకులతో వేశారు. బ్రిటీష్ వారి పాలనలో నిర్మించిన ఈ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయంగా వాడుకున్నారు. ఇటీవల ఆర్కిటెక్టు అధికారులు ఈ భవనాన్ని పరిశీలించి 114 ఏళ్ల కిందట నిర్మించినప్పటికి పటిష్ఠంగా ఉందని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు భావన్



నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 20: జాతీయ స్థాయి అండర్ - 15 చదరంగం పోటీలకు కుమార్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి కొల్లా భావన్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ పిన్నమనేని వెంకట కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా గోరంట్లలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు భావన్ ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ మూడు నుంచి 16 వరకు తమిళ నాడులోని కోసూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు.

సినీ రంగంలో ఆణిముత్యం హాస్యనటుడు రాజబాబు

భీమవరం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : హాస్యనటుడు రాజబాబు సినీ రంగంలో ఆణిముత్యం అని, హాస్యానికే భాష్యం చెప్పిన ఆయన చిరస్మరణీయులని ప్రముఖ నిర్మాత, దర్శకుడు తుమ్మలపల్లి రామసత్యనారాయణ అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాజబాబు జయంతి నిర్వహించారు. ముందుగా రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలుర్పించారు. రామ సత్యనారాయణ మాట్లాడుతూ రాజబాబు సహజ హాస్యనటుడు అని ఆనాటి అగ్రనటులతో కలిసి నటించారన్నారు. ఆయన నటించిన సినిమాలకు ప్రేక్షకులు ఎగబడి వచ్చేవారన్నారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ మన జిల్లా వాసి అయిన రాజబాబు ముందు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ నాటకాలపై మోజుతో నాటక ప్రదర్శనలు ఇచ్చారని అనంతరం సినిమాల్లో నటించి అతి తక్కువ కాలంలోనే మంచి హాస్య నటుడిగా గుర్తింపు పొందారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రాజబాబు భీమవరం పట్టణానికి పలు మార్లు వచ్చారని ఆయన చివరికాలంలో చాలా కష్టపడ్డారన్నారు. చైతన్యభారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, ప్రజానాట్య మండలి సభ్యులు మల్లుల సీతారామప్రసాద్, ఉండపల్లి రమేష్‌నాయుడు, చల్లా రాము, తుమ్మలపల్లి ఆంజనేయగుప్త, తదితరులు పాల్గొన్నారు.



రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నిర్మాత, దర్శకుడు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తదితరులు

నాడు నేడు




రహదారికి మోక్షం

ఏళ్ల తరబడి ఉన్న సమస్య పరిష్కారం

గ్రామస్థుల హర్షం

పెంటపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పల్లెల్లో వెలుగులు చిమ్ముతున్నాయి. దీర్ఘకాలిక సమస్యలు కూడా పరిష్కార మార్గాన పయనించడంతో గ్రామాలలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగి వేశారిన ప్రజలకు కూటమి ప్రభుత్వం ఓదార్పుగా నిలిచింది. మండలంలోని పడమర విప్పర్రు రహదారి అధ్వానంగా ఉంటుంది. కే.పెంటపాడు నుంచి గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారే కాదు..గ్రామం నుంచి గణపవరం వెళ్ళే ప్రధాన రహదారి కూడా సంవత్సరాల తరబడి అధ్వానంగా ఉండేది. వర్షం వస్తే గ్రామంలో ప్రయాణం చేయడానికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అటువంటి రహదారికి మోక్షం వచ్చింది. కూటమి ప్రభుత్వం రాగానే సుమారు రూ.3 కోట్లతో ఊరి మొదట నుంచి గ్రామ శివారు వరకూ సీసీ రహదారిని నిర్మించారు. కొద్దిపాటి పనులు మినహా పూర్తయింది. సంవత్సరాల తరబడి సమస్య శాశ్వత పరిష్కారం కావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు భోజనాలు

ఆచంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయాన్నే కళాశాలకు రావాల్సి ఉండటంతో భోజనం తెచ్చుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టీడీపీ హయాంలో ఒక సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. తరువాత ఈ పథకాన్ని కొనసాగించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆచంట ఎంవీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ నున్న శ్రీదేవి దాతల సహకారంతో ప్రతీ రోజూ 40 నుంచి 50 మంది విద్యార్థులకు కళాశాల వద్దే భోజనాలు తయారు చేసి పెడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అంటే జులై నుంచి ఇలా చేస్తున్నారు. ఒక వేళ దాతలు లేకపోతే ప్రిన్సిపాల్ తన సొంత ఖర్చులతోనే ప్రతీ రోజూ భోజనాలు పెట్టిస్తున్నారు. దీంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందిస్తున్నారు. "వివిధ ప్రాంతాల నుంచి ఉదయమే కళాశాలకు రావాల్సి ఉంది. దీంతో కొంత మంది విద్యార్థులు భోజనం తెచ్చుకోలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తున్నది. విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఇలా ఏర్పాటు చేశాం.సిబ్బంది సహకారంతో భోజనం తయారు చేసి విద్యార్థులకు పెడుతున్నాం.." అని కళాశాల ప్రిన్సిపాల్ నున్న శ్రీదేవి చెప్పారు.



విద్యార్థులకు భోజనాలుపెడుతున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కొనలేం.. తినలేం..

» దిగిరాని కూరగాయల ధరలు.. గత వారం మాదిరిగానే ధరలు
» సంచి నిండాలంటే రూ.300 నుంచి 400 వరకు చెల్లించాల్సిందే..

పెంటపాడు/పాలకొల్లు అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆదివారం కూడా గతవారం మాదిరిగానే ఉన్నాయి. వారానికి సరపడ కూరగాయలతో సంచి నిండాలంటే రూ.300 నుంచి 500 వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. టమాటా, దొండకాయలు మినహాయించి ప్రతి కూరగాయ ధర గత వారం ధరే పలికింది. గత వారం రూ.80 అమ్మకం జరిగిన టమాటా ఈ వారం రూ.60లకు దిగింది. ఉల్లిపాయలు మాత్రం పాతవి రూ.60, కొత్తవి రూ.35 ధరతో కొనసాగాయి. ధరలు తగ్గుముఖం పట్టకపోవ డంతో వినియోదారులు ఇబ్బందిగానే కూరగాయలు కొనుగోలు చేశారు. ఇలా అయితే కొనలేం తినలేం అంటూ అవేదన వ్యక్తం చేశారు. తెల్లవంకాయిలు రూ. 50, నల్లవంకాయిలు రూ.50, బెండకాయలు రూ.40, దొండకాయలు రూ.35- 40, క్యారెట్ రూ.60, బీరకాయ రూ.60, పచ్చిమిర్చి రూ.40, బంగాళాదుంపలు రూ.40, ములక్కాయలు కాయ రూ.10, చిక్కుడు కాయలు రూ. 80, అరటికాయలు 3 రూ.20, బీన్నీస్ రూ.100, క్యాప్సికం రూ 100-120, అల్లం రూ.80 ధరలు పలికాయి.



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల దుకాణం

పాలకొల్లులో వంకాయలు కిలో రూ.80, బీర కాయలు కిలో రూ85, దోస కాయలు రూ.60, దొండ, బెండ కిలో రూ.45, బంగాళా దుంపలు రూ.60, ఉల్లిపాయలు రూ.45నుంచి 50, పచ్చిమిర్చి రూ.60, టమాటా రూ.65 నుంచి 70, అరటి కాయలు జత రూ.20, అల్లం పావు కిలో రూ.60 పలికింది.



పంచాయతీ రాజ్ ఇంజనీర్ల అధ్యక్షుడిగా శామ్యూల్

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ రాజ్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నరసాపురానికి చెందిన కె.శామ్యూల్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లో పంచాయతీ రాజ్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కేడీఆర్ స్వామి వ్యవహరించారు. రాష్ట్ర సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్నెం రాంబాబు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా డి.విశ్వనాథరాజు (భీమవరం), ప్రధాన కార్యదర్శిగా ఎంవీఎస్ఎస్ రాజు (భీమవరం), ఫైనాన్స్ కార్యదర్శిగా పి.చక్రధర్ (తణుకు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.సూర్య నారాయణ (తణుకు) ఎన్నికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సంఘ సభ్యులు పూలమాలతో సత్కరించారు.

విద్యుత్ చార్జీల భారం మోపితే ఉద్యమిస్తాం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి

గణపవరం, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ట్రూఅప్ చార్జీలు ఉండవని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపేందుకు సిద్ధపడడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరి కుమార్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పిప్పర పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపితే కాంగ్రెస్, వామపక్ష నాయకులతో కలిసి ఉద్యమిస్తామన్నారు.



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రైతు నేస్తం పురస్కారం అందుకున్న పరిమి సత్యనారాయణ దంపతులు

పరిమికి రైతు నేస్తం పురస్కారం

ఉంగుటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఆదివారం ఏలూరు జిల్లా ప్రకృతి వ్యవ సాయ దారుడు పరిమి సత్యనారాయణకు రైతు నేస్తం-2024కు పురస్కారాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అందించారు. ఆదివారం స్వర్ణ భారత్ ట్రస్టులో జరిగిన పురస్కారాల వేదికపై వెల్లమిల్లి గ్రామానికి చెందిన పరిమి సత్యనారాయణ దంపతు లకు ఈ పురస్కారం అందించారు. వెంకయ్య నాయుడితో పాటు కైకలూరు శాసన సభ్యుడు కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న బ్యాంకు అధికారులు

కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకుకు అవార్డులు

విశాఖపట్నం, అక్టోబరు 20 : బ్యాంకింగ్ ఫ్రంటీరియర్స్ అవార్డుల ఉత్సవంలో కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకుకు మూడు విభాగాలలో ఉత్తమ అవార్డులు లభించినట్టు బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. ఇటీవల లక్నోలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో బ్యాంకు అధికారులు వీరేంద్రప్రసాద్, సాయిచరణ్‌లు అవార్డులు అందుకున్నారు. సైబర్ సెక్యూరిటీ, క్రెడిట్ ఇనీషియేషన్, వార్షిక రిపోర్టు విభాగాల్లో ఉత్తమ అవార్డులు లభించాయి. పాలకవర్గం, సిబ్బంది కృషితో ఇది సాధ్యమైందని ఛైర్మన్ ఆనందం వ్యక్తం చేశారు. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 32 శాఖలతో ఖాతా దారులకు సేవలందిస్తున్నామని రానున్న రోజుల్లో విశాఖ నగరంలోని మెయిన్ రోడ్డులో నూతన శాఖతో పాటు మరిన్ని శాఖలను ప్రారంభించనున్నట్టు బ్యాంకు సీఈవో శ్యామ్‌కిశోర్ తెలిపారు.



8 కిలోల పండుగప్ప

పెనుగొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద గోదావరిలో ఆదివారం మత్స్యకారుడు సత్య నారాయణ చేపలు పట్టేందుకు వల వేయగా సుమారు 8 కిలోల పండుగప్ప చిక్కింది. ఈ చేపను సిద్ధాంతం మార్కెట్‌కు తీసుకురాగా రూ.5 వేలు ధర పలికింది.

రొయ్యలకు ఆక్సిజన్ కొరత

కలిదిండి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. మట్టగుంట కొండంగి, గొల్లగూడెం, దుంపలకోడు దిబ్బ, మూల్లంక, భాస్కరావపేట గ్రామాల్లో చెరువుల్లో రొయ్యలు తేలిపోతుండడంతో కౌంటుకు రాకుండానే హడావుడిగా పట్టుబడి చేస్తున్నారు. చిన్న సైజు రొయ్యల పట్టుబడితో వ్యాపారు లు కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆకివీడు మార్కెట్‌లో అయినకాడికి అమ్ముకుంటున్నామని, గిట్టుబాటు కావడం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు.చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో పిచికారీ చేయాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్ సూచించారు.

పోస్టుమార్టం విభాగంపై విచారణ జరపాల్సిందే



ఏలూరు క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉన్న పోస్టుమార్టం విభాగంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాల్సిందేనంటూ పలువురు కోరుతున్నారు. అక్కడ సిబ్బంది మృతదేహాలకు పోస్టుమార్టం జరపాలంటే వారడిగిన సొమ్ములు చెల్లించాల్సిందే. గతంలో ఇదే విధంగా వేలాది రూపాయలు వసూలు చేస్తుండడంతో దిన పత్రికల్లో కథనాలు రావడంతో చివరకు నూజివీడు ఆర్డీవోతో విచారణ జరిపించారు. వాస్తవం అని తేలడంతో అక్కడ పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి (పోస్టుమార్టం అసిస్టెంట్)ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. కొంతకాలం అంతా ప్రశాంతంగా ఉన్నా మళ్ళీ యధేచ్ఛగా సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా క్రమేపీ వాటిని తొలగించారు. అక్కడ ఉన్న సిబ్బంది పోస్టుమార్టం కోసం సొమ్ములు తీసుకున్నట్లు కెమెరాల్లో రికార్డు కావడంతో రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. ఆ తరువాత ఆ కెమెరా లు ఎవరు తీశారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మృతదేహాలను ప్యాకింగ్ చేయడానికి ప్యాకింగ్ వస్తువులు అంటూ రూ.1,500 నుంచి రూ.3,000 వరకూ వసూలు చేస్తున్నారు. అక్కడ పోస్టుమార్టం చేసిన వారు కూడా ఎదుటి వారి పరిస్థితిని బట్టి అందినకాడికి గుంజేస్తున్నారు. సమయం దాటిపోయిందని పోస్టుమార్టం జరపరంటూ చెబుతున్నారు.

గతంలో ఆదివారం కూడా పోస్టుమార్టం..

గతంలో వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్నప్పుడు సాధారణంగా ఆదివారం కూడా పోస్టుమార్టం జరిపేవారు. కాని ప్రస్తుతం మెడికల్ కాలేజీ నిబంధనల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం వరకు మాత్రమే పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా 2021లో ప్రభుత్వం ఒక ఉత్తర్వులు జారీ చేసింది. స్పష్టమైన వెలుతురు ఉన్నప్పుడే పోస్టుమార్టం జరపాలని, లేదంటే విద్యుత్ కాంతులు పూర్తిస్థాయిలో ఉన్నప్పుడే పోస్టుమార్టం జరపాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా ప్రస్తుతం కాస్త వెలుగు తగ్గిందంటే తాము పోస్టుమార్టం చేయలేమంటూ ఫోరెన్సిక్ విభాగం వైద్యులు నిరాకరిస్తున్నారు. మృతుడి బంధువులు మరుసటి రోజువరకూ బాధలతోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో అర్ధరాత్రి వేళ కూడా పోస్టుమార్టం జరిపించడానికి ఆర్డీవో అనుమతి తీసుకుని జరిపేవారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ అయిన తరువాత ఆర్డీవో అనుమతి కోరుతూ లేఖ రాసిన దాఖలాలు లేవు. ఇటీవల ఆసుపత్రి నుంచి మృతదేహాలు హైదరాబాద్, చెన్నై, ఇతర మెడికల్ కాలేజీలకు వెళ్ళినట్టుగా ఆధారాలను గుర్తించారు. ఒకటి రెండు రోజుల్లో విచారణలో వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి. ఇప్పటికే నిఘా విభాగాలు అన్ని కోణాల్లో తమదైన శైలిలో ఆధారాలు సేకరిస్తున్నారు. ఆరోగ్యశాఖ రాష్ట్రస్థాయి అధికారులు ఇక్కడ పరిస్థితులపై విచారణ చేపట్టినట్టు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతగిరి, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని మర్ధగుడ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఆదివారం ఇద్దరు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. అరకు అందాలను తిలకించి, మైదాన ప్రాంతానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ మర్ధగుడ మలుపు వద్ద ద్విచక్రవాహనంతో జారిపడ్డారు. ఈ ప్రమాదంలో ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన పి.చందు, మధు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికుల సాయంతో 108 వాహనంలో అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యసేవల నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

సరదాగా ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు

పెదవేగి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) :సరదాగా ఈతకు దిగిన వ్యక్తి నీటిలో మునిగి గల్లంతైన విషాదకర సంఘటన పెదవేగి మండలం కవ్వగుంటలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బెజవాడ ప్రసాద్(45)కు 25 ఏళ్ల కిందట వివాహమైంది. పెళ్ళైన ఏడాదిలోపే భార్య అతడిని విడిచి వెళ్ళిపోయింది. తల్లి మృతిచెందగా, తండ్రి రత్తయ్య దీర్ఘకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఉన్నాడు. కూలి పనులతో జీవనం సాగించే ప్రసాద్ ఆదివారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని పోలవరం కుడికాలువలో స్నానానికి దిగి ఈతకొడుతూ సరదాగా గడిపాడు. ఆ సమయంలో కొంతమంది వ్యక్తులు అతడి విన్యాసాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈత కొడుతున్న ప్రసాద్ ఒక్కసారిగా నీటిలో మునిగి, ఇక పైకి లేవలేదు. ఆందోళనకు గురైన అక్కడివారు పోలీసులకు సమాచారం అందించి, వెతుకులాట చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ కానరాకపోవడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ అగ్నిమాపకశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చీకటి పడడంతో అగ్నిమాపక సిబ్బంది కూడా నిస్సహాయతను వ్యక్తం చేశారు.



గల్లంతు కావడానికి ముందు ఈత కొడుతున్న ప్రసాద్ (సర్కిల్‌లో)

యువకుడి గల్లంతు !

» చించినాడ బ్రిడ్జిపై మోటారు సైకిల్ గుర్తింపు

యలమంచిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చించినాడ బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం స్కూటీ ఉండడం.. సంబంధిత వ్యక్తులు ఎవరూ అక్కడ లేకపోవడంతో ఎవరైనా బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకేశారా అనే సందేహం పలువురు స్థానికులకు కలిగింది. కొద్దిసేపటి తరువాత బ్రిడ్జి వద్దకు పూలపల్లికి చెందిన ఈద రామ్ అనే యువకుడి కుటుంబసభ్యులు వచ్చి బ్రిడ్జిపై ఉన్న బైక్ రామ్‌కు చెందినదని గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆ యువకుడు అతడి స్నేహితుడికి ఫోన్ చేసి చించినాడ బ్రిడ్జి వద్ద ఉన్నానని.. గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో స్నేహితుడు అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే యువకుడి కుటుంబసభ్యులు చించినాడ బ్రిడ్జి వద్దకు చేరుకోగా స్కూటీ మాత్రమే అక్కడ ఉంది. రాత్రి సమయం కావడంతో ఆచూకీ కోసం గోదావరిలో గాలింపు చర్యలు చేసేందుకు అవకాశం లేకుండాపోయింది.

పేకాట నిర్వాహకుడు కానిస్టేబులే

ఏలూరు క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారపుపేటలో పోలీసులు దాడి చేసి పట్టుకున్న పేకాట శిబిరాన్ని ఒక కానిస్టేబులే నిర్వహిస్తున్నారంటే పోలీసులు అవాక్కయ్యారు. ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నగదాసి రవి (పిసి 2022) గత కొంత కాలం నుంచి భారీ ఎత్తున శనివారపుపేటలోని అవిరెడ్డి అపార్టుమెంటులో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మొత్తం మీద నిఘా బృందాలు కదలికలను గుర్తించి దాడులు జరిపారు. దాడుల్లో రెండు లక్షల 37 వేల 500 నగదు, 11 సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కంది సూర్యప్రకాష్ (పిసి 1137), పశ్చిమ గోదావరి జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ అన్నెం శ్రీనివాసరావు (ఏఆర్‌పీసీ 409) ఉండడంతో పోలీస్ శాఖ అవాక్కయింది. వీరితో పాటు మరో 8 మందిని అరెస్టు చేశారు. ఉన్నతాధికారులు ఈ సంఘటనపై సీరియస్‌గా తీసుకుని కఠిన చర్యలను చేపట్టారు.

క్రైమ్ కార్నర్

బాత్‌రూంలో పడి కూలీ మృతి

» రైసు మిల్లు బాత్‌రూంలో కుళ్లిన మృతదేహం గుర్తింపు
» అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు

దెందులూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అనుమానాస్పదంగా రైసుమిల్లు బాత్‌రూంలో మృతి చెంది కుళ్లిన మృత దేహం లభ్యమైన ఘటన దెందులూరు మండలంలో జరిగింది. దెందులూరు ఎస్‌ఐ శివాజీ తెలిపిన వివరాలివి.. దెందులూరు మండలం రామారావు గూడెం గ్రామంలోని సుభద్ర రైస్ మిల్లులో తణుకు మండలం ఉండ్రాజవరానికి చెందిన రోజువారీ కూలీలు పనిచేస్తూ ఉంటారు. శనివారం రాత్రి రైసు మిల్లు అవరణలో ఉన్న బాత్ రూం నుంచి దుర్వాసన రావడంతో మిల్లు యజమాని చూసి విషయాన్ని దెందులూరు పోలీసులకు తెలిపారు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి మృతదేహం ఉండ్రాజవరానికి చెందిన రోజుకూలీ తూము రాంబాబు (53)గా గుర్తించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాదవశాత్తు బాత్ రూంలో పడ్డాడా ? లేక ఎవరితోనైనా గొడవపడి చనిపోయాడా అనేది సీసీ కెమెరాలతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

మొగల్తూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : రామన్నపాలెం పంచాయతీలో ఓ గృహంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని సీఐ జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన సీఐ మాట్లాడారు. గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తున్న కడలి వెంకటలక్ష్మి నివాసంలో గతనెల 14వ తేదీన రూ.1.50 లక్షల విలువైన వెండి, బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. ఆదివారం రామన్నపాలెం ఓఎన్‌జీసీ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారణ చేశామన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన మట్టపర్తి రాజ్‌కుమార్, పసలదీవికి చెందిన అల్లం రాములను గుర్తించి విచారించగా నేరం అంగీకరించారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఉన్నాడని అతడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. అల్లం రాము ద్వారా నేరాలకు పాల్పడిన వారికి ఆశ్రయం ఇస్తూ వారు చేసిన దొంగతనాల్లో కొంత భాగం అందిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. దొంగిలించిన సొమ్ము, ఆభరణాలు సోమవారం ఉదయానికి రికవరీ చేస్తామన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ జి.వాసు, ఏఎస్‌ఐ రాజేంద్ర తదితరులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

కుక్కునూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : ఐసర్ వ్యాన్‌లో అడుగున మారుజాతి కలపను లోడ్ చేసి పైన జామాయిల్ మొద్దులను ఏర్పాటు చేసి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నామని అటవీ సిబ్బంది తెలిపారు. ఆదివారం కుక్కునూరు గ్రామ శివారులో ఓ వ్యాన్‌లో మారుజాతి కలప తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో అటవీశాఖ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి వాహనాన్ని పట్టుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సిబ్బంది తెలిపారు. గత కొంత కాలంగా యథేచ్ఛగా మారుజాతి కలపను నరుకుతూ అక్రమార్కులు వ్యాపారం చేస్తున్నా.. అటవీ సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. కిలోమీటరు పరిధిలోనే అధిక చెట్లు నరికేసి కలపను తరలిస్తున్నప్పటికి అటవీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ముడుపులు తీసుకుంటూ కార్యాల యాలకే పరిమితమవుతున్నారని విమర్శలు న్నాయి.



అక్రమంగా కలప తరలిస్తూ పట్టుబడిన లారీ

చేబ్రోలులో హాస్టల్ నిర్వాహకుడిపై పోక్సో కేసు

ఉంగుటూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు బాలుర ప్రైవేటు హాస్టల్ నిర్వాహకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని చేబ్రోలు ఎస్‌ఐ సూర్యభగవాన్ తెలిపారు. వివరాలివి.. శనివారం నారాయణపురం హైస్కూల్ హెచ్‌ఎం షేక్ మీరా సాహెబ్ ఫిర్యాదు మేరకు తాడేపల్లిగూడెం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి, చేబ్రోలు ఎస్‌ఐ సూర్యభగవాన్ స్థానిక ప్రైవేట్ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా చేబ్రోలు గ్రామానికి చెందిన మల్లపు వెంకటసుధాకర్ స్థానికంగా ఎంపీఎం బాలుర వసతి గృహాన్ని నిర్వహిస్తున్నాడు. కొంతమంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ నారాయణ పురం హైస్కూల్‌లో చదువుతున్నారు. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులతో హాస్టల్ నిర్వాహకుడు వ్యక్తిగత పనులు చేయించుకోవడంతో పాటు నగదు వసూలు చేయడం రాత్రి వేళల్లో తన గదికి రప్పించుకుని వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. ఈ పరిణామాలకు కలత చెందిన విద్యార్థులు ఇటీవల టీసీలు తీసుకున్నారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం షేక్ మీరా సాహెబ్ ఈవైఈవో, చేబ్రోలు ఎస్‌ఐల దృష్టికి తీసుకు వెళ్లగా శనివారం పాఠశాలలో విచారణ జరిపి హాస్టల్ నిర్వాహకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. హాస్టల్ విద్యార్థులను కైకరం ఎస్సీ ప్రత్యేక హాస్టల్‌కు తరలించారు.



సీజ్ చేసిన వాహనాలు

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న మూడు వాహనాల సీజ్

» ఎనిమిది మందిపై కేసు నమోదు

దెందులూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను దెందులూరు పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని గంగన్న గూడెం పరిధిలో పులివాగు గట్టు సమీపంలో మూడు వ్యాన్‌లలో వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు పరిశీలించి వాహనాలతో సహా సీజ్ చేశారు. వాహనాల్లో ఉన్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపా రు. కోళ్ల వ్యర్థాల వ్యాపారం పైడి చింతపాడు, ఆగడాలలంక, చెట్టున్నపాటు, కైకలూరు తదితర ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా సిండికే ట్‌గా ఏర్పడి చేపల చెరువులకు మేతగా వ్యర్థాల ను తరలిస్తున్నారని వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు.

మోటారు సైకిల్‌పై వచ్చి బంగారు గొలుసు చోరీ

పాలకోడేరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) :బైక్‌పై వెనుక కూర్చున్న భార్య మెడలో నుంచి గుర్తుతెలియని యువకులు మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్ళిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. పాలకోడేరు ఎస్‌ఐ హరిబాబు తెలిపిన వివరాలివి.. గరగపర్రు గ్రామానికి చెందిన నామన శ్రీను అతడి భార్య ఈనెల 19వ తేదీన అనాకోడేరు గ్రామంలో బంధువుల ఇంటి వద్దకు వెళ్ళి అదేరోజు సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా 25-30 ఏళ్ల వయసు గల ఇద్దరు యువకులు భార్యభర్తలను బైక్‌పై వెంబడించి గరగపర్రు గ్రామ సమీపంలో ఆమె మెడలోని బొందును లాక్కున్నారు. దంపతులిద్దరూ కిందపడిపోగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్లే స్థానికులు చూసి వారిని 108లో భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



సూర్యనారాయణ(ఫైల్)

ఉంగుటూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : కైకరం గ్రామానికి చెందిన కూనా సూర్యనారాయణ(71)అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని చేబ్రోలు ఎస్‌ఐ సూర్యభగవాన్ తెలిపారు. గ్రామానికి చెందిన సూర్యనారాయణకు రెండేళ్ల క్రితం భార్య మృతి చెందగా మూలశంక బాధతో గత రెండు నెలలనుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మానసికంగా కుంగిపోవడంతో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించి తొలుత ఆశ్రం ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

సీఎం చిత్రపటాన్ని అసభ్యంగా పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

లింగపాలెం, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటాన్ని అసభ్యకరంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకన్న ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం బోగోలుకు చెందిన సాతునూరు లక్ష్మీనవదీప్ అనే వ్యక్తి ముఖ్యమంత్రి చిత్ర పటాన్ని అసభ్యంగా చిత్రీకరించి పోస్టు చేసినట్లు కె.యోహాన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రచనలకు ఆహ్వానం

ఏలూరు అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలోని హైస్కూళ్ళ లో చదువుతున్న బాలబాలికల నుంచి 'బాల భాషిణి' బాలల పత్రికకు స్వీయ రచనలను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శిఇ.ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవభారత నిర్మాణం, విద్యార్థుల పరిశోధనలు-నూతన ఆవిష్కరణలు, పొదుపు-నిరాడంబరత, నీతి కథలు అంశాలపై రచనలను నవంబరు 5వ తేదీలోగా కార్యదర్శి, సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 చిరునామాకు పోస్టులో పంపాలని సూచించారు. ఉత్తమ రచనలకు నవంబరు 14న బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

సంఘాభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

ఏలూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంఘం అభివృద్ధికి, సంఘీయులు సహకరించాలనిది. ఏలూరు పట్టణ కొప్పుల వెలమ, కుల సంఘం అధ్యక్షుడు బి.పాపారావు కోరారు. పవర్‌పేటలోని సంఘ భవనంలో ఆదివారం మహాజన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మరడాని రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘీయులు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి ఎం.అచ్యుతరావు మాట్లాడుతూ సంఘం తరపున చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎ.ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ ఎం. రంగారావు, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరి ఎం.చంద్రశేఖర్, ఎ.తిరుపతిరావు, గౌరవసలహాదారు బి.శివప్రసాద్, ఎల్.గోవిందరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్పించిన జనసేన నేత



టి.నరసాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పడిన గోతులను ఆదివారం స్థానిక జనసేన నాయకుడు కె.రమేష్ తన నగదు సుమారు రూ.30 వేలతో మట్టి తోలించి పూడ్పించారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై పలు ప్రమాదాలు జరుగుతుండటంతో గుంతలు పూడ్పించినట్లు రమేష్ తెలిపారు.

ఆదివాసీ మహిళలపై దాడులకు నిరసన



బుట్టాయగూడెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళలపై దాడి చేసినవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మహిళలపై దాడిని ఖండిస్తూ ఆదివారం బుట్టాయగూడెంలో నిరసన తెలిపారు. లక్ష్మణరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం ఎస్టీ మకివలస గ్రామంలోకి హరే రామ హరే కృష్ణ సభ్యులు చొరబడి ఆదివాసీ మహిళలపై విచక్షణ రహితంగా ప్రవర్తించారని, వారి దుస్తులను చించివేశారని అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలను ప్రజాస్వామిక వాదులు, ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. అధికారులు వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు టి.శ్రీనివాసరావు, కొవ్వాడయ్య, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరానికి శంకుస్థాపన



పెదవేగి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : విజయరాయి ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న ప్రార్థనా మందిరానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం శంకుస్థాన చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నిత్యావసరాలను అందిస్తూ ఆకలిబాధలను తీర్చడంలో ఆర్‌సీఎం సంస్థలు ముందుంటాయని ప్రభాకర్ పేర్కొన్నారు. వికార్ జనరల్ ఫాదర్ డాక్టర్ బాల, ఫాదర్ సంతురాజు ఎస్వీడీ, ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ బెన్నీ ఎస్వీడీ, మత గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.

సంప్రదాయాలపై అవగాహన

టి.నరసాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పూర్వీకుల సంస్కృతి, సంప్రదాయాల పై విద్యార్థులకు అవగాహన అవసరమని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో అవ్వాతాతల సమావేశం నిర్వహించారు. అవ్వ, తాతలను సన్మానించారు. ప్రిన్సిపాల్ శంకరరావు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సిహెచ్ అనురాధ, కోఆప్షన్ సభ్యులు శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ప్రభుత్వాస్పత్రుల పారిశుధ్య కార్మికుల ఆందోళన

బుట్టాయగూడెం, అక్టోబరు 20 : (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలను చెల్లించాలని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలంటూ ఆదివారం పారిశుధ్య కార్మికులు బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్యం కేంద్రం ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా జీతాలు అందక కార్మికులు అవస్థలు పడుతున్నారని, ఆరు నెలలుగా అర్ధకాలితో అలమటిస్తున్నట్లు వాపోయారు. వేతనాలు, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడం కార్మికుల హక్కు అని వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.ధర్మరాజు, టి.కృష్ణ, ఎం.సత్యవతి, ఎం.సుంద రమ్మ, కె.వంశీ, ఎం.సుజాత, కె.లక్ష్మీ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఏరియా ఆస్పత్రి లోని పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు కె.వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ ఆస్పత్రులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, నెలకు 26 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు టి.దయామణి, ఎ.జ్యోత్స్న, జి.మేరీ, ప్రభావతి, శ్రీను, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● చింతలపూడి : పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలంటూ స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ కార్మికులు నిరసన



చింతలపూడి ఏరియా ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తెలిపారు. ఈ నిరసనలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి.బాబు మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు ఇచ్చేటప్పుడు కార్మికులకు ప్రతీ నెలా పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లిస్తున్నట్టు కాంట్రాక్టర్ జీతాల్లో సొమ్ము తగ్గించుకుని ఇస్తున్నారని, కాని వాటిని జమ చేయడంలేదని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గత నెల 17వ తేదీన వైద్య విధాన పరిషత్ ప్రిన్సిపల్ సెక్రటరీకి విన్నవించామన్నారు. అందువలన ఈనెల 31వ తేదీ వరకుకార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతారని, 31 నుంచి సమ్మెలోకి కార్మికులు వెళ్తారని తెలిపారు. మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ మండల అధ్యక్షురాలు పి.మరియమ్మ, టి.రాము, కె.నాగరాజు, కె.శ్రీనివాసరాజు, పి.రాజకుమారి, ఎం.సుజాత, కార్మికులు పాల్గొన్నారు.

అమరులైన పోలీసులకు ఘన నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

టి.నరసాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం ఎందరో పోలీసులు అమరవీరుల య్యారని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. స్థానిక పోలీసులు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఏఎస్సై వి.జయకుమార్, రాజు, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం అభినందనీయం : సొంగా



దత్తాత్రేయను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సొంగా

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న తెలుగు రైతు ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అబ్బిన దత్తాత్రేయను ఎమ్మెల్యే రోషన్ కుమార్ అభినందించారు. పట్టణంలో అబ్బిన దత్తాత్రేయకు శాశ్వత సభ్యత్వాన్ని ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదివారం అందచేశారు. దత్తాత్రేయను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, పట్టణఅధ్యక్షుడు రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్, తదితరులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

కామవరపుకోట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వ ర జూనియర్ కళాశాల వద్ద ఆదివారం 1999-2001కి చెందిన విద్యార్థులు అపూర్వ సమ్మేళం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కరచలనం చేసుకోవడం, గత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగ వ్యాపారాలు వివరించడం, కుటుంబ సభ్యుల వివరాలు తెలియచేయడంతో ఉల్లాసంగా గడిపారు. ప్రతీ సంవత్సరం ఏదొక వేదిక వద్ద ఈ బ్యాచ్ కలుసుకోవాలని తీర్మానం చేశారు. సమాజ శ్రేయస్సుకు పని చేయాలని నిర్ణయించారు.

మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న దాడులు, అసాంఘిక చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపడతామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయం వద్ద ఆదివారం భవన నిర్మాణ రాష్ట్ర మహిళా కార్మికుల సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు అధ్యక్ష తన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వలస కార్మికులు ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. మహిళా ఆలిండియా కమిటీ సభ్యురాలు అనసూయమ్మ, సీనియర్ నాయకులు పిల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు యర్రా రాంబాబు, బి.సాంబశివరావు, అల్లాడి గోపాల్, బి.రాజు, చందక రామకృష్ణ, కొండ వెంకటేష్, కె.ముత్యాలప్ప, లక్ష్మీ, కామాక్షమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి సీపీఐని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

ద్వారకాతిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ భవనం ఆవరణలో ఆదివారం పార్టీ మహాసభ జరిగింది. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కరవయ్యాయని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ద్వారకాతిరుమల మురికి కూపంలా తయారైందన్నారు. మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని విచారణ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకూ తమ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. నేతలు జి.బాలయేసు, బండి వెంకటేశ్వరరావు, కె.లక్ష్మణరావు, రమణరాజు, రాజు పాకనాటి ప్రభావతి పాల్గొన్నారు.

వారికి సీపీఎంతో సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రవి

బుట్టాయగూడెం, అక్టోబరు 20: (ఆంధ్రజ్యోతి) : తూర్పు రేగుల కుంట గ్రామానికి చెందిన చోడెం దుర్గ, బేతి కిషోర్ కార్యకలాపాలకు సీపీఎంకి ఎటువంటి సంబంధం లేదని జిల్లా కార్యదర్శి ఎ.రవి స్పష్టం చేశారు. బుట్టాయగూడెంలో పోలోజు నాగేశ్వరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దుర్గ కొంత కాలంగా పార్టీ సభ్యురాలు కాదని, పార్టీ పేరును ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నట్లు తెలి పారు. ఈమెతోపాటు బేతి కిషోర్ కూడా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో దూరం గా పెట్టడం జరిగిందన్నారు. వీళ్ళు చేపట్టే కార్యక్రమాలను సీపీఎంకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు, ప్రజలు గుర్తించాలని తెలిపారు. డిసెంబరు 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెం మండల కేంద్రంలో జరుగు సీపీఎం 26వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు టి.రామకృష్ణ, ఎ.ఫ్రాన్సిస్, ఎం.నాగమణి, టి.ముత్యాలమ్మ, కె.జలపాలు, ఎ.వెంకటేష్, వి.వీరయ్య సీహెచ్.బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి దూరంగా ఉన్నా..

కొందరు వ్యక్తుల పద్ధతులు నచ్చక తానే సంవత్సర కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నట్లు చోడెం దుర్గ ప్రకటనలో తెలిపారు. పార్టీ కోసం జైలుకు కూడా వెళ్లాలని, కేసుల్లో స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నానని, తనపై అబండాలు వేయడం సరికాదన్నారు. పార్టీలో జరుగుతున్న విషయాలపై రాష్ట్ర పార్టీకి లేఖ రాయడం జరిగిందని విచారణ చేస్తే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయన్నారు.

అమ్మవార్ల తెప్పోత్సవం



ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగేశ్వరపురం చెరువు గట్టు వద్ద గల శ్రీ గణేష్ కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద ఆదివారం సంబరాలు, రథం ఊరేగింపు, తెప్పోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గంగానమ్మ, ముత్యాలమ్మవార్ల ప్రతిమను రథంపై అలంకరించి మేళతా ళాలు, బాజాభజంత్రీలతో ఊరేగింపు జరిపారు. తదుపరి ఆలయ ప్రాంతంలో గల చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నౌడగాని శ్రీనివాసరావు, రెడ్ల పూర్ణచంద్రరావు ఏర్పాట్లు చేశారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, వైసీపీ నాయకులు మామిళ్ళపల్లి జయప్రకాష్, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, నారా శేషు, కార్పొరేటర్లు జున్నూరి నరసింహ రావు, అద్దేపల్లి రాధిక తదితర బృందం పాల్గొని కార్యక్రమాలను తిలకించారు.

అధ్యాత్మికం

గుబ్బల మంగమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మతల్లి సన్నిధిలో భక్తులు

బుట్టాయగూడెం, అక్టోబరు 20 : (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ఏజెన్సీ అటవీ ప్రాంతంలో కొలువై అడవి బిడ్డలచేత పూజలందుకుంటున్న గుబ్బల మంగ మ్మతల్లిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వాతావరణం పొడిగా ఉండటంతో అమ్మవారి దర్శినానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది.

రాట్నాలమ్మవారికి ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మను సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని, పూజలు జరిపారు. పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చు కున్నారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.48 వేలు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 18.750లు, ఫోటో విక్రయాలద్వారా రూ.3,120లు ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

శ్రీవారి క్షేత్రం భక్తులతో కళకళ

ద్వారకాతిరుమల : చిన్నతిరుమలేశుని ఆలయాన్ని ఆదివారం సుమారు పదివేల మంది పైబడి భక్తులు సందర్శించారు. అందరికీ సెలవు రోజు కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉచిత దర్శనానికి గంటన్నర పైబడి సమయం పట్టింది, స్వామివారిని భక్తిప్రపత్తులతో దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణములో ఉచిత తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత శ్రీవకుళమాత అన్నప్రసాద భవనానికి వెళ్లి స్వామివారి అన్నప్రసాదాన్ని వేలాది మంది స్వీకరించారు.

అన్న సమారాధనలు

పోలవరం : నూతనగూడెం, పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేట గ్రామాలలో కనకదుర్గ ఆలయాల వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదానాలు నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాల్లో సుమారు 2 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భిక్ష ప్రాంభించిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్: దక్షిణపు వీధిలో వేంచేసి ఉన్న శ్రీమార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్పస్వాముల భిక్షా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. అనంతరం మారుతి నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణ, గంగా భిక అమ్మవారి సంబరాల్లో ఎమ్మెల్యే చంటి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసే న ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, కార్పొరేటర్లు కర్రి శ్రీనివాసరావు పప్పు ఉమామహేశ్వరరావు, ఎంఆర్‌డీ బలరామ్, ఆర్నేపల్లి తిరుపతి, పూజారి నిరంజన్, మాకాల రమేష్, ఆలయ కవిటీ సభ్యులుపాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోంది : ఎమ్మెల్యే పత్సమట్ల



భీమడోలులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, అక్టోబరు 20(ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలులో ఆదివారం రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, రూ.75 లక్షలతో మెటల్ రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే ధర్మరాజుతో కలిసి జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు శంకుస్థాపనలు చేశారు. అలాగే దుద్దేపూడి, కోడూరుపాడు, ఎంఎంపురం, పూళ్ళ, భీమడోలు, పోలసానపల్లిలో పల్లె పండుగ నిర్వహించారు. వట్టి పవన్, పుప్పాల హరీష్, నోచర్ల శ్రీనివాస్ కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు : పల్లెపండుగలో భాగంగా మేడేపల్లి, రామవరం గ్రామాలలో రూ. 10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు అధికారులు కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ఎం.శ్రీహరి, జడ్పీటీసీ రామలక్ష్మి, ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి, సర్పంచ్‌లు రాంబాబు, పిట్టా ప్రసాద్, కూటమి నాయకులు ఎ.అశోక్, జి.ఆదినారాయణ పాల్గొన్నారు.

● కుక్కునూరు : మండలంలో పలు చోట్ల సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కుక్కునూరు మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి జూనియర్ కాలేజీకి వెళ్లే రహదారికి, కొండపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ నరసింహారావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగందర్, మంత్రి గోపాలకృష్ణ, బీజేపీ కోశాధికారి లక్ష్మణాచార్యులు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, జడ్పీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు జాతీయ రైతు సదస్సు

ఉంగుటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : విజయవాడలో మంగళవారం జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాలు కోరాయి. కైకరం తూర్పు వీధిలో ఆదివారం జరిగిన రైతు సదస్సులో రైతు సంఘం మాజీ అధ్యక్షులు జీవీ కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.అప్పారావు పాల్గొన్నారు.

25న ఎమ్మెల్యే సొంగా పర్యటన

కామవరపుకోట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఈ నెల 25న కామవరపుకోట మండలంలో పర్యటిస్తారని మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

ఆయుష్ ఉచిత వైద్య శిబిరం

ఏలూరు అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్, నెక్కలపూడి మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ భానుకిరణ్ మొత్తం 145 మందికి రోగనిర్ధారణ, ఈసీజీ పరీక్షలు చేసినట్టు వివరించారు. క్యాంపు కన్వీనర్ ఎస్.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య సేవలు

పోలవరం అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ రామకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం ఉచిత హోమియో చికిత్స శిబిరం రాజమహేంద్రవరం శ్రీజగద్గురు పీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆశ్రమ నిర్వహకురాలు మాతాశ్రీ ఎస్.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. వైద్యులు మల్లేశ్వరరావు బృందం, సేవా నిర్వహకులు డాక్టర్ బి.విజయబాబు, కె.రామకృష్ణ, టి.నాని పాల్గొన్నారు.

135 మందికి కంటి పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ నాయకులు ఎం.రామారావు నాయకత్వంలో ఆదివారం వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం 135 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించింది. దృష్టిలోపం ఉన్న 36 మందికి కళ్ళజోళ్ళు అందచేశారు. 19 మందికి కంట్లో శుక్లాలు ఉన్నట్టు గుర్తించి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ శిబిరాన్ని ఉషా అధినేత బాలకృష్ణారావు ప్రారంభించారు. లయన్స్ నాయకులు యు.రత్నకుమార్, బి.మురళీ, సుబ్రహ్మణ్యం, ప్రతినిధులు సీహెచ్.వెంకట్రామయ్య, బి.సురేష్‌కుమార్, ఏవీ సుబ్బారావు సేవలందించారు.

హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి

లింగపాలెం, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న అన్నారు. ధర్మాజీగూడెంలో ఆదివారం వాహన తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమతోపాటు సరైన పత్రాలు ఉంచుకోవాలన్నారు. ఒకే వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించకూడదన్నారు.

గ్రంథ పఠనంతో మేలు



పెదవేగి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : గ్రంథ పఠనంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞాన దాయకమైన పుస్తకాలను చదివారు.

జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు బిలాల్ మసీదు బాధ్యతలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బిలాల్ మసీదు కమిటీ గడువు ముగియడంతో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆదేశాలతో చార్జి తీసుకున్నట్లు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షఫీవుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ వచ్చేంత వరకూ బిలాల్ మసీదుకు చెందిన ప్రతీ విషయం తానే చూస్తానని పేర్కొన్నారు.

సెల్యూట్ పోలీస్

నేడు అమర వీరుల సంస్మరణ దినోత్సవం



ఏలూరు క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రేయనక, పగలనక, వాననక 24 గంటలూ ఉద్యోగం చేసేది పోలీసులే. తుఫాన్లు వచ్చినా, వరదలు వచ్చినా తమ కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారో, ఎలా కాపాడుకోవాలో అన్న విషయం కంటే ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని విధి నిర్వహణలోనే ఉండాల్సిన పరిస్థితులు వారివి. పండుగొస్తే అంతా తమ భార్యాబిడ్డలతో కలిసి ఆనందంగా ఉంటే పోలీసులు మాత్రం తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఏ గుడిదగ్గరో, ఏ ప్రధాన కూడళ్ళలోనో, ఏ విఐపీ వద్దో విధి నిర్వహణలో ఉంటూ మనసులో పండుగ జరుపుకోవాల్సిందే.. ప్రజలకు పోలీసులు ఎంత దగ్గర అవుతున్నప్పటికీ ప్రజలు మాత్రం వారికి ఇంకా దూరంగా ఉండ డంపై పోలీసులు కొంత ఇబ్బబందికి గురవు తున్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు చేరువ కావడానికి 15 ఏళ్ళుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. మైత్రీ సంఘాలు, జనసంరక్షణ సంఘాలు, పోలీసు గ్రామ రక్షణ కమిటీలు, శాంతి కమిటీలు పేర్లతో ప్రజలకు చేరువవుతూ వచ్చారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో పోలీసుకు దత్తత కూడా చేశారు. సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణా లను ఫణంగా పెడుతున్న పోలీసులకు ప్రజలు కూడా చేరువ కావాలి. శాంతిభద్రతల పరిరక్షణలో వారికి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. నేడు పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఎక్కడ ఏ ట్రాఫిక్‌కు అంతరాయం జరిగినా ఎక్కడ ఏ సంఘటన జరిగినా పోలీసులు ఎక్కడ అంటూ ఆతృతగా ప్రతి ఒక్కరు ఎదురు చూస్తారు. వెయ్యి మంది ఆందోళనకారులు వచ్చినా అదుపు చేయగల శక్తి ఆ పోలీసు యూనిఫాంకు ఉంది. శాంతిభద్రతలు కాపా డటంలో పోలీసులు అహర్నిశలు విధి నిర్వహణలో విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు. 2022 ఏప్రిల్ 3వ తేదీన జిల్లా విభజన జరగ డంతో ఏలూరు జిల్లాగా ఆవిర్భవించింది. పోలీస్ సిబ్బంది పంపకాలు అనంతరం జిల్లాకు 1,463 మందిని కేటాయించారు. వీరికి చేదోడు వాదోడుగా 605 మంది హోమ్‌గార్డులు జిల్లాలో వివిధ విభాగాల్లో విధులను నిర్వర్తిస్తున్నారు. ఎనిమిది ఏళ్ళుగా పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో రిటైర్‌మెంట్ అవుతున్నారే తప్ప పోస్టులు భర్తీ అవ్వడం లేదు. గతంలో స్టేషన్లకు ఉన్న సిబ్బందే ఉంటున్నారే తప్ప అదనపు సిబ్బంది మంజూరు కావడం లేదు. ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతూ రకరకాల నేరస్తులు ప్రజలను మోసాలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని ఛేదించడంలో పోలీసులు ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో కూడా ఉంటూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగంపై పనిభారం పెరిగిపోయింది. పోలీసులకు నిర్వహించే వైద్య శిబిరాల్లో షుగరు, బీపీలు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ఏడాది అనారోగ్యంతో ఒక ఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్, ఒక ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఎఆర్ కానిస్టేబుల్ మొత్తం ఐదుగురు మరణించారు. ఒక హోంగార్డు అనారోగ్యంతో మరణించాడు.

నేడు అమర పోలీసులకు నివాళులు


1959లో చైనా, ఇండియా యుద్ధం జరుగుతున్న సమయంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు అక్టోబరు 21వ తేదీన సరిహద్దు ప్రాంతమైన లడక్ వద్ద టెంట్‌లు వేసుకుని గస్తీలో ఉన్నారు. ఆ సమయంలో చైనా మిలటరీ దళాలు మూకమ్మడిగా సీఆర్‌పీఎఫ్ స్థావరంపై దాడిచేసి 10 మంది జవాన్లను ఊచకోత కోశారు. వారు ఆఖరి నిమిషం వరకు వీరోచితంగా చైనా మిలటరీతో పోరాడి అశువులు బాశారు. ఆ నాటి నుంచి పోలీసు శాఖ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తోంది. ఏలూరులోని జిల్లా పోలీసు పరేడ్స్ గ్రౌండ్స్ 65వ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర ఏ విధంగా ఉందో సమాజ రక్షణలో పోలీసు పాత్ర అదే విధంగా ఉంది. సమాజ శ్రేయస్సు ధ్యేయంగా విధి నిర్వహణలో అసాంఘిక శక్తులతో పోరాడి అశువులు బాసిన పోలీసులను స్మరించుకుని నివాళులర్పించడానికి పోలీసు యంత్రాంగం సమాయత్తమైంది.

పోలీస్ సంక్షేమానికి కృషి చేస్తాం : ఎస్పీ కిశోర్



శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజా శ్రేయస్సుకు పోలీసులు శక్తి వంచన లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీస్ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం. వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ప్రతినెల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తుంది. వారికి రావాల్సిన అన్ని రాయితీలను సకాలంలో త్వరితగతిన అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఆ కుటుంబానికి తోడ్పాటుగా ఉండేందుకు కారుణ్య నియామకాలు త్వరితగతిన జరుపుతున్నాం. పోలీసుల ఆరోగ్య భద్రతకు ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇస్తూ మెడికల్ క్యాంపులు నిర్వర్తిస్తున్నాం.

లేత వయసు ప్రేమలు



దారి తప్పుతున్న మైనర్లు చిన్నతనంలోనే ప్రేమ పెళ్ళిళ్ళు..

కొన్నాళ్ళకే ఎడబాటు పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు

వారిద్దరూ మైనర్లు...ఓ కళాశాలలో పరిచయం అవుతారు.. పరిచయం కాస్తా ప్రేమగా మారుతుంది. ఒకానొక సమయంలో ఇద్దరూ ఏకం అవుతారు.. అనంతరం పెద్దలకు ఇష్టం ఉన్నా లేకపోయినా బయటకు వెళ్లి వివాహం చేసుకుంటారు. పిల్లలు పుట్టాక ఇక అక్కడ నుంచి విబేధాలు ప్రారంభం అవుతాయి. అవి విడిపోయే వరకు దారి తీస్తాయి.. ఇదంతా 2000 సంవత్సరంలో విడుదలైన ఒక సినిమాలోని సన్నివేశం.. ఆ సినిమాలో చూపించిన విధంగానే ప్రస్తుత సమాజంలో యువత కూడా పయనిస్తున్నది. మైనార్టీ తీరకుండానే ప్రేమ పేరుతో ఆకర్షితులై తర్వాత ఇబ్బందులు పడుతున్నారు. - భీమవరం క్రైం

ఎవరైనా అమ్మాయి చనువుగా మాట్లాడితే చాలు దాన్ని ప్రేమగా అర్థం చేసుకుని ఇక చదువుపై దృష్టి తగ్గిస్తున్నారు. ఒకవేళ అవతలివారు ప్రేమకు అంగీకరించకపోతే ఏదో ఒక అఘాయిత్యానికి పాల్పడుతూ జీవితాలను ప్రేమకు ఫణంగా పెడుతున్నారు. పెద్దలు ఏమైనా అంటే ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్ళిపోయి పెళ్లి చేసుకుని కొన్నాళ్ళకు తిరిగి రావడం పరిపాటిగా మారింది. వచ్చినవారు మైనర్లు అయితే పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే కొంత మంది మాత్రమే దూరం అవ్వడానికి ఒప్పుకుంటుండగా మరికొంత మంది తాము విడిపోయేది లేదంటూ ఖరాఖండిగా చెబుతూ ఉండటంతో పోలీసులు కూడా చేతులెత్తేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరోపక్క ప్రేమ వివాహం చేసుకున్న వారు పిల్లలు పుట్టిన తర్వాత విభేదాలు రావడంతో ఎంతోమంది విడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో వారు పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కక తప్పడం లేదు. ఇలా ఎంతోమంది యువత వారి భవిష్యత్ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

● భీమవరం నాచువారి సెంటర్‌కు చెందిన ఒక యువకుడు కొన్నాళ్ల క్రితం అదే ప్రాంతంలో ఉన్న యువతి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే తల్లితండ్రులు ఎంతో నచ్చజెప్పినప్పటికీ ఆ యువకుడే తనకు కావాలంటూ పట్టుబట్టింది. ఈ విషయమై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరిగింది. వివాహం చేసుకున్న యువకుడిని పోలీసులు ఆ యువతిని ఎలా పోషిస్తావు అంటూ నిలదీయగా సరైన సమాధానం లేదు. అయినా కూడా ఆ యువతిని తీసుకుని అక్కడ నుండి వెళ్లిపోయాడు. అయితే వారిద్దరి మధ్య విబేధాలు నెలకొని విడిపోయారు.

● పాలకొల్లు మండలానికి చెందిన ఒక యువతి భీమవరం కళాశాలలో చదువుతూంది. భీమవరం పట్టణానికి చెందిన యువకుడు ఆమెకు ప్రేమ పేరుతో లొంగదీసుకుని వివాహం చేసుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినా కూడా ఆ యువతి వినకపోవడంతో ఆమె తల్లితండ్రులు తన కుతురు చనిపోయిందంటూ వెళ్లిపోయారు. కాని కొంతకాలానికి ఇద్దరూ విడిపోగా ఆ యువతి తల్లితండ్రుల చెంతకు చేరింది.

● భీమవరం పట్టణానికి చెందిన యువతిని విశాఖపట్టణానికి చెందిన యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఒక కుమారుడు జన్మించాక ఆ యువతిని పుట్టింటికి పంపించి ఆ యువకుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాడు. తర్వాత నుంచి అతని జాడలేకుండా పోయింది.

● నరసాపురం పట్టణానికి చెందిన యువతి మొగల్తూరు మండలానికి చెందిన యువకుడిని ప్రేమ వివాహం చేసుకొంది. ఇద్దరూ కలిసి ఒకే కంపెనీలో పనికి చేరారు. కానీ కంపెనీలో పని చేస్తూ ఉండ గానే ఇద్దరికి విబేధాలు రావడంతో అక్కడ తగాదా పడ్డారు. చివరకు విడిపోయారు.

తెలిసీ తెలియక..

యువత ఎవరిమాట వినడం లేదు. దీంతో భవిష్యత్ అడ్డదారుల్లో వెళుతూ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో కష్టాలను భరించిన తల్లిదండ్రుల పరిస్థితి అయోమయంలో పడుతుంది. పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్న ఆశలు నెరవేరడం లేదు. ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుని కొన్నాళ్ల తర్వాత తెగతెంపులు చేసుకున్నారు. యువతకు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఫలించడం లేదు.

కాళీచరణ్ ,భీమవరం టూ టౌన్ సీఐ

పడకేసిన పారిశుధ్యం

» అపరిశుభ్రంగా వీధులు » పట్టించుకోని పాలకులు, అధికారులు



రహదారి పక్కన వేస్తున్న చెత్త

ముసునూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో పారిశుధ్యం పడకేసింది. వీధులు, ప్రధాన కూడళ్ళు సైతం చెత్తచదారంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగునీరు రహదారులపై ప్రవహిస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దోమల ఉధృతిపెరిగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అయితే చెత్త నుంచి సంపద సృష్టిం చేలా సంపద కేంద్రాలకు చెత్తను తరలిం చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన అధికా రులు, పాలకులు నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహ రిస్తున్నారు. గ్రామంలో చెత్త సేకరణ జరగకపోడంతో ఎక్కడ చూసిన చెత్తచదారం రహదా రులపైనే దర్శనమిస్తోంది. ఈ పంచాయతీలో గత ఐదేళ్లకు ఒక్కసారి కూడా డ్రైనేజీ పూడికతీ తపనులు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పారిశు ధ్య మెరుకు చేపట్టిన చర్యలు ముచ్చుకు కూడా లేవని స్థానికులు పాలకులు, అధికారుల పని తీరుపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికైన గ్రామంలో చెత్త సేకరణ చేపట్టడంతో పాటు అపరిశ్రభత లేకుండా పారుశుధ్య మెరుగుకు జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నూజివీడు బస్టాండ్ వద్ద ఇలా..



నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 20: నూజివీడు ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కొద్ది పాటి వర్షానికే బస్టాండ్ ఆవరణలో నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షపు నీటికి తోడు వ్యర్థాలు కలిసి బస్టాండ్ ప్రాంగణం తీవ్ర దుర్గంధం వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. పారిశుధ్య నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.





వేమవరప్పాడులో సీసీరోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పోతుమర్రులో శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

కైకలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా ఆచవరం, వింజరం, వేమవరప్పాడు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాని ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో రహదారులన్నీ సీసీ రహదారులగా నిర్మాణం చేస్తామని, ప్రజలకు అవసరమైన తాగునీరు జలజీవన్ మిషన్ ద్వారా అందిస్తామన్నారు. గ్రామాలకు అవసరమైన అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గ్రామాల్లో ఎన్ని రహదారులు సీసీ రహదారులగా మార్చవలసి ఉంది ఆయా గ్రామప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాధరాజు, పూల రామచంద్రరావు, తేరా రమేష్‌బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కట్టా నాగరాజుగౌడ్, ధర్మరాజుల నాగమణి, నున్న రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి అన్నారు. పోతుమర్రు, ఆవకూరు, కొచ్చెర్ల, సానారుద్రవరం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్‌లతో కలసి శంకుస్థాపన చేశారు. పోతుమర్రు సర్పంచ్ వరలక్ష్మి, ఆవకూరు సర్పంచ్ నరసయ్య, కూటమి నాయకులు నంబూరి హరికృష్ణంరాజు, పామర్తి సత్యనారాయణ, వడ్డి గంగరాజు, పంచాయతీ రాజ్ ఏఈఈ బి.శ్రీనివాస్, ఉపాధి పథకం ఏపీవో ఆనంద్ పాల్గొన్నారు.



కల్యాణమహోత్సవంలో భక్తులు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ముదినేపల్లి (కైకలూరు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం, పూజలు చేశారు. వందలాదిమంది భక్తులు పాల్గొని కనులారా తిలకించారు. ఆలయ ఈవో ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.



శ్రీహరిని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తలారి శ్రీహరి

కైకలూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ శ్రీకృష్ణా యాదవ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా తలారి శ్రీహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సంఘ మాజీ అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు అధ్యక్షతన సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. సుమారు 500మంది సభ్యులు పాల్గొన్నారు. తలారీ శ్రీహరి గతంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్‌గా పనిచేయడమే గాక యాదవ సంఘ అభివృద్ధికి, సంఘ సమస్యల పరిష్కారానికై కృషి చేయడంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షులు బీకేఎం నాని, నున్న రమాదేవి, బోయిన రామకృష్ణ, ఉలిసి శ్రీనివాసరావు, నున్న వెంకటేశ్వరరావు, తలారీ వెంకటస్వామి, గంగుల అశోక్, కానుబోయిన నాంచారయ్య, బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



చాట్రాయి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు వ్యక్తిగతంగా, సామూహికంగా ఎస్సై రామకృష్ణ కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లతో ఎస్సై మాట్లాడుతూ రౌడీషీటర్లు అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనవద్దని, సమాజంలో శాంతి సామరస్యాలకు విఘాతం కలిగించకూడదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో దూరంగా ఉండాలని, మంచి నడవడిక కలిగి సత్ప్రవర్తనతో జీవిస్తే రౌడీషీట్లు ఎత్తివేయటానికి పై అధికారులకు సిఫార్సు చేస్తామని ఎస్సై రామకృష్ణ అన్నారు.

మినుము రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న రైతులు

నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 20: వరద కారణంగా నష్టపోయిన మినుము రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పల్లెర్లమూడిలో మినుము రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రామిలేరు వరద వల్ల పంట దెబ్బతిని రైతులు నష్టపోయినా పంట నష్ట నమోదు చేయకపోవడం అన్యాయం అన్నారు. గ్రామంలో సుమారు 50 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని ఎకరానికి రూ.15 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావు, రైతులు పోలగాని కొండయ్య, కొలుసు వెంకటేశ్వరరావు, ఇస్సాకు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ వ్యాపారంలోకి పీఏసీఎస్‌లు



చాట్రాయి, అక్టోబరు 20: ఇప్పటి వరకు రైతులకు పంట రుణాలు, భూమి అభివృద్ధి రుణాలు, ఎరువుల సరఫరా వంటి కార్యకలాపాలు సాగిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)లు కొత్తగా పెట్రోల డీజిల్ వ్యాపారంలో అడుగుపెడుతున్నారు. ఇందులో భాగంగా చిన్నంపేట, తుమ్మగూడెం, పోలవరంలలో పెట్రోల్ బంకులు నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయటానికి పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకవర్గాలు చెపుతున్నాయి. కొన్ని పెట్రోల్ బంకులలో కొలతలు తక్కువగా ఉంటున్నాయని, ఒక్కోసారి నాణ్యత లోపం కన్పిస్తున్నదని పీఏసీఎస్‌ల పెట్రోల్ బంకులు ఉపయోగంలోకి వస్తే మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.



మట్టగుంటలో హడావుడిగా రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

ఆక్సిజన్ కొరతతో తేలిపోతున్న రొయ్యలు

కలిదిండి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. మట్టగుంట కొండంగి, గొల్లగూడెం, దుంపలకోడు దిబ్బ, మూల్లంక, భాస్కరావుపేట గ్రామాల్లో చెరువుల్లో రొయ్యలు తేలిపోతుండడంతో కౌంటుకు రాకుండానే హడావుడిగా పట్టుబడి చేస్తున్నారు. చిన్న సైజు రొయ్యల పట్టుబడితో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆకివీడు మార్కెట్‌లో అయినకాడికి అమ్ముకుంటున్నామని, గిట్టుబాటు కావడం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. కనీసం ఖర్చులు రాక అప్పులు పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదిలో పిచికారి చేయాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్ సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు



గుడిపాడులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముసునూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గుళ్ళపూడిలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కా రానికి నిధులు కేటాయించి, గ్రామాల అభివృదికి సహకరించిన మంత్రి కొలుసు పార్థసారథికి టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గుడిపాడులో సభలో సీనియర్ టీడీపీ నాయకులు కొల్లి గంగారామ్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు ఆదివారం మాట్లాడుతూ గుళ్ళపూడి, గుడిపాడు గ్రామాల సమస్యలను మంత్రి సారథి దృషికి తీసుకువెళ్ళిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారన్నారు. లోపూడి తమ్మిలేరు నుంచి వచ్చే సబ్ చానల్ వరద నీటి ఉధృతికి తెగిపోకుండా గోడ నిర్మాణానికి మంత్రి రూ.2 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. మూడు గ్రామాల చెరువులకు నీరువచ్చే సప్లైయి ఛానల్‌ను గత ప్రభుత్వ పట్టించుకోకపోడంతో పూర్తిగా పూడుకుపోయిందని, ఈ కాలువ పూడికతీతకు నిధులు ఇచ్చి, పనులు చేయించారని చెప్పారు. గుడిపాడు, గుళ్ళపూడి బీసీకాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు బోర్లు మంజూరయ్యాయన్నారు. రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి రూ.37 లక్షలను కేటాయించారని తదితర అభివృద్ధికి చొరవ చూపారన్నారు. నాయకులు మందలపు ధర్మరాజు, కొల్లి ప్రసాద్, వి.రామ్మోహన్, పి.రామకృష్ణ, వి.ధర్మరావు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి సీపీఐని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

ద్వారకాతిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవనం ఆవరణలో ఆదివారం పార్టీ మహాసభ జరిగింది. తొలుత పార్టీ జెండా ను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కరవయ్యాయని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ద్వారకాతిరుమల మురికి కూపంలా తయారైం దన్నారు. మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని విచారణ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన వాగ్దానాలను అమలు చేసేవరకూ తమ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. నేతలు జి.బాలయేసు, బండి వెంకటేశ్వరరావు, కె.లక్ష్మణ రావు, రమణరాజు, రాజు పాకనాటి ప్రభావతి పాల్గొన్నారు.

చోరీకి యత్నం

ముసునూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. వివరాలల్లోకి వెళ్ళితే స్థానికుడైన సీహెచ్‌వీ మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా ఈ నెల 15న మలేషియా వెళ్ళారు. అయితే ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టిన దుండగులు చోరీకి యత్నించారు. ఆదివారం ఉదయం ఇంటికి వస్తామని మల్లికార్జునరావు పాలు పోసే వ్యక్తికి చెప్పడంతో పాలు తీసుకువచ్చిన వ్యక్తి ఇంటి తాళం పడలుగొట్టి ఉండటం చూసి, మల్లికార్జునరావు అన్నయ్య మహేశ్వరరావుకు సమచారమిచ్చాడు. అతడు 112కు కాల్ చేయడంతో ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని, చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే మలేషియాలో ఉన్న యాజమానితో ఎస్ఐ మాట్లాడి ఇంట్లో ఉన్న సామగ్రి, నగదు వివరాలను తెలుసుకుని, తనిఖీ చేశారు. యాజమాని చెప్పిన విధంగా అన్ని వస్తువులు, నగదు ఉన్నాయని, ఎటువంటి వస్తువులు చోరీకి గురికాలేదని ఎస్ఐ తెలిపారు. యాజమాని ఇచ్చే ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు భావన్



నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 20: జాతీయ స్థాయి అండర్ - 15 చదరంగం పోటీలకు కుమార్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి కొల్లా భావన్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ పిన్నమనేని వెంకట కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా గోరంట్లలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు భావన్ ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ మూడు నుంచి 16 వరకు తమిళనాడులోని కోసూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని అభినందించారు.

200 మందికి కంటి పరీక్షలు

నూజివీడు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 20: తోటి విద్యార్థులకు సహాయం చేయడమే కాక సమాజ సేవకు తాము ఎల్లప్పుడు ముందుంటామని నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నిరూపించారు. ట్రిపుల్ ఐటీలో తోటి విద్యార్థుల సహాయం కోసం ఏర్పడిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అశ్వని ఫౌండేషన్‌తో కలిసి కృష్ణా జిల్లా పెడన మండలం దామోజీ పాలెంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. 700 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 300 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవసరం అయిన వారికి చైతన్య ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ రమేష్, ట్రిపుల్ ఐటీ వలంటీర్లు పాల్గొన్నారు.